TELANGANA RISING 2047

RNI.No. TELTEL/2010/32434

# అన్వేషణ నేత్రం

ఎడిటర్ : గోళ్ల రమేష్

తెలుగు దినపత్రిక

సంపుటి :12 సంచిక : 49 | మంగళవారం 16 జూన్ 2026 | హైదరాబాద్ | పేజీలు : 8 , రూ.1.00

## అమెరికా-ఇరాన్ శాంతి

# ఒప్పందం.. స్వాగతించిన ప్రధాని మోదీ..


2 లో..

అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందాన్ని ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ ఒప్పందంతో పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం నెలకొనడమే కాకుండా సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రాకపోకలు కొనసాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ ఖాతా ద్వారా ప్రధాని మోదీ స్పందించారు.'గత కొద్ది నెలలుగా పశ్చిమాసియాలో కొనసాగిన ఘర్షణల వల్ల అనేక దేశాల్లో ప్రాణనష్టం సంభవించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడింది. అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం ప్రాంతీయ ఉద్రిక్తతలను తగ్గించి, శాశ్వత పరిష్కారానికి దోహదపడుతుంది.




# మోదీ హామీల లెక్క తేల్చండి..

- ఆ తర్వాత నా రాజీనామా గురించి మాట్లాడండి
- మోదీ ఇచ్చిన హామీలపై ముందుగా సమాధానం చెప్పాలి
- మెట్రో విస్తరణను బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయి..
- మెట్రో విస్తరణకు కిషన్‌రెడ్డి నిధులు విడుదల చేయిస్తారా?
- మెట్రోపై కిషన్‌రెడ్డి కుట్ర పన్నారు..
- కిషన్‌రెడ్డిని కేసీఆర్ తిట్టినట్లు తాను తిట్టలేదు
- కేసీఆర్ డైరెక్షన్‌లోనే కేంద్రమంత్రి పనిచేస్తున్నారు..
- సీఎం రేవంత్‌రెడ్డి

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేస్తారా? అంటూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'మోదీ హామీల లెక్క తేల్చండి.. ఆ తర్వాత నా రాజీనామా గురించి మాట్లాడండి' అంటూ ప్రతి సవాల్ విసిరారు. (సోమవారం) సచివాలయంలో మీడియాతో ముఖ్యమంత్రి మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ముందుగా సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. దేశ ప్రజలకు ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, విదేశాల్లోని నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రతి భారతీయుడి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని మోదీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

2 లో..





# వచ్చే ఏడాది నుంచి పిల్లలకు సోషల్ మీడియా నిషేధం: బ్రిటన్ ప్రధాని

సోషల్ మీడియా దుష్ప్రభావాల నుంచి పిల్లలను కాపాడేందుకు యూకే ప్రభుత్వం నడుం కట్టింది. వచ్చే ఏడాది నుంచి యూకేలో 16 ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియా వినియోగించకుండా నిషేధం విధిస్తామని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తాజాగా తెలిపారు. ఈ ఏడాది చివరి కల్లా ఇందుకు సంబంధించిన చట్టాన్ని రూపొందిస్తామని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి నాటికి అమల్లోకి తెస్తామని అన్నారు.

2

## ఇందిరాగాంధీ బతికుంటే బీజేపీని

# నిషేధించేవారు: అశోక్ గహ్లోత్

దేశ రాజకీయాల్లో సరికొత్త వివాదం చెలరేగింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ భారతీయ జనతా పార్టీ (బీజేపీ)ని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. దివంగత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ గనుక ఇప్పుడు బతికుంటే బీజేపీ లాంటి పార్టీని ఎప్పుడో నిషేధించేవారంటూ ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనిపై బీజేపీ కూడా అంతే ఘాటుగా స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీకి హిందువులన్నా, హిందుత్వ అన్నా తీవ్ర ద్వేషమని మండిపడింది.

2






# గోల్కొండలో సంచలనం సృష్టించిన హత్య కేసు ఛేదించిన పోలీసులు

వార్త 2లో

## ధాన్యం కొనుగోలులో తెలంగాణపై

# కేంద్రం వివక్ష: మంత్రి తుమ్మల ధ్వజం

తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. మద్దతు ధర (మీస్రా), ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరును ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. కేంద్రం నుంచి ఆశించిన స్పందన లభించడం లేదని, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం కేవలం మద్దతు ధరను ప్రకటించి, ఆ తర్వాత కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకుంటోందని ఆయన ధ్వజమెత్తారు.


2


2

# ట్రంప్ డీల్‌కు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు : ఇజ్రాయెల్ మంత్రి

## తెలంగాణ వచ్చినా

# సింగరేణిలో పరిస్థితి మారలేదు: కవిత


2

మాజీ మంత్రి హరీశ్ రావుపై తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. హరీశ్ రూ.40లక్షల టన్నుల బొగ్గు స్కామ్ జరిగిందని అంటున్నారని, సరైన సమాచారం లేకుండానే కోల్ బెల్ట్‌లో తిరుగుతున్నారంటూ వ్యాఖ్యానించారు.

## ఎస్ఐఆర్ పై కాంగ్రెస్, బిఆర్ఎస్

# అనవసర విమర్శలు : రామచంద్రరావు

హైదరాబాద్:

దొంగ ఓట్లు నమోదు చేయడంలో కాంగ్రెస్ ఎక్స్ పర్ట్ అని టిబిజెపి చీఫ్ రామచంద్రరావు ఆరోపించారు. ఓట్ చోరీ చేసిందే కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దొంగ ఓట్లను తొలగించడానికే ఎస్ఐఆర్ ఉందని తెలియజేశారు. బంగ్లాదేశీయులు, రొహింగ్యాలను ఓటరు లిస్టు నుంచి తొలగించ వద్దా? రొహింగ్యాలకు హైదరాబాద్ లో ఓటు హక్కు ఇద్దామా? అని రామచంద్రరావు ప్రశ్నించారు. ఎస్ఐఆర్ పై కాంగ్రెస్, బిఆర్ఎస్ అనవసర విమర్శలు చేస్తున్నారని, రాజ్యాంగాన్ని కాంగ్రెస్ చోరీ చేసిందని మండిపడ్డారు. కేరళ లో కూడా ఎస్ఐఆర్ జరిగిందని ..అక్కడ కాంగ్రెస్ గెలిచిందని అన్నారు. దేశంలో ఇప్పటి వరకు 12 సార్లు ఎస్ఐఆర్ జరిగిందని రాంచంద్రరావు పేర్కొన్నారు.




2

# ప్రభుత్వబడుల్లో బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించిన పొన్నం ప్రభాకర్

# అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందం.. స్వాగతించిన ప్రధాని మోదీ..

హైదరాబాద్, అన్వేషనేత్రం ప్రతినిధి

అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందాన్ని ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ ఒప్పందంతో పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం నెలకొనడమే కాకుండా సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రాకపోకలు కొనసాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ ఖాతా ద్వారా ప్రధాని మోదీ స్పందించారు.'గత కొద్ది నెలలుగా పశ్చిమాసియాలో కొనసాగిన ఘర్షణల వల్ల అనేక దేశాల్లో ప్రాణనష్టం సంభవించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడింది. అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం ప్రాంతీయ ఉద్రిక్తతలను తగ్గించి, శాశ్వత పరిష్కారానికి దోహదపడుతుంది. సుస్థిరమైన తుది ఒప్పందం కుదిరేలా.. మిగిలిన అంశాలపై కూడా సానుకూల చర్చలు కొనసాగుతాయని ఆశిస్తున్నాం' అని మోదీ పేర్కొన్నారు. ఇరాన్‌తో యుద్ధాన్ని ముగించేలా శాంతి ఒప్పందం ఖరారైందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ ఒప్పందం ప్రకారం ఇరు దేశాలు యుద్ధ చర్యలను నిలిపివేసి, ప్రపంచ చమురు సరఫరాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి మార్గాన్ని తిరిగి తెరవడానికి అంగీకరించాయి. దీనివల్ల అంతర్జాతీయ చమురు మార్కెట్లలో ధరలు తగ్గుముఖం పట్టాయి.

# వచ్చే ఏడాది నుంచి పిల్లలకు సోషల్ మీడియా నిషేధం: బ్రిటన్ ప్రధాని

ఇంటర్నెట్ డెస్క్: అన్వేషనేత్రం ప్రతినిధి

సోషల్ మీడియా దుష్ప్రభావాల నుంచి పిల్లలను కాపాడేందుకు యూకే ప్రభుత్వం నడుం కట్టింది. వచ్చే ఏడాది నుంచి యూకేలో 16 ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియా వినియోగించకుండా నిషేధం విధిస్తామని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తాజాగా తెలిపారు. ఈ ఏడాది చివరి కల్లా ఇందుకు సంబంధించిన చట్టాన్ని రూపొందిస్తామని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి నాటికి అమల్లోకి తెస్తామని అన్నారు. ఆన్‌లైన్ ప్రపంచం తాలూకు చెడు ప్రభావాల నుంచి పిల్లల్ని కాపాడుకునేందుకు గట్టి రక్షణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 'పూర్తిస్థాయి నిషేధమే సబబని నాకు అనిపిస్తోంది. దీన్ని అమలు చేయడం చాలా కష్టం. కానీ టెక్ కంపెనీ ఒత్తిడిని ప్రతిఘటించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే' అని ప్రధాని కీర్ స్టార్మర్ స్పష్టం చేశారు.ఈ ప్రతిపాదనల పూర్తిస్థాయి అమలుకు తాను సిద్ధమేనని పేర్కొన్నారు. పిల్లల భద్రత, ఆనందం విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. పిల్లలకు ఆన్‌లైన్ ప్రపంచం నుంచి రక్షణ కల్పించడమే ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న కుటుంబాల పక్షాన నిలవాల్సిన సమయం ఇదేనని అభిప్రాయపడ్డారు. యథాతథ స్థితితో ఎలాంటి ప్రయోజనం కలగట్లేదని తాము గుర్తించినట్టు చెప్పారు.ఆస్ట్రేలియాలో ఇప్పటికే ఈ తరహా నిషేధం అమలవుతోంది. సోషల్ మీడియాపై ఆంక్షలకు ఇండోనేషియా కూడా సిద్ధమైంది. పిల్లల సోషల్ మీడియా వినియోగానికి సంబంధించి బ్రెజిల్‌లో ఇప్పటికే పలు రకాల ఆంక్షలు అమల్లో ఉన్నాయి. పిల్లలకు సోషల్ మీడియా నిషేధానికి ఫ్రాన్స్ కూడా సిద్ధమైంది. తుర్కియే చర్యలు తుదిదశలో ఉన్నాయి. ఇతర పాశ్చాత్య దేశాలు కూడా ఇదే బాటలో అడుగులు వేస్తున్నాయి. అయితే, తాను తీసుకునే చర్యలు చాలా కఠినంగా ఉంటాయని బ్రిటన్ ప్రధాని చెప్పారు. ఈ విషయంలో ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తామని అన్నారు.

# ట్రంప్ డీల్‌కు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు : ఇజ్రాయెల్ మంత్రి

ఇంటర్నెట్ డెస్క్: అన్వేషనేత్రం ప్రతినిధి

యూఎస్-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందంపై ఇజ్రాయెల్ జాతీయ భద్రతా వ్యవహారాల మంత్రి ఇతమార్ బెన్-గ్విర్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ కుదుర్చుకున్న ఒప్పందానికి ఇజ్రాయెల్ కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని అన్నారు. ఇజ్రాయెల్ ఒక సార్వభౌమ దేశమని, అమెరికాకు సామంత రాజ్యం కాదని తేల్చి చెప్పారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో తమకు గతంలో ఎదురైన గుణపాఠాల ఆధారంగా ఈ డీల్ విషయంలో స్పందిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.'ట్రంప్ ఒప్పందానికి మేము కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు. మేము యూఎస్‌కు సామంత రాజ్యం కాదు.. ఇజ్రాయెల్ ఒక సార్వభౌమదేశం. అయితే, మేము స్పష్టంగా చెప్పదలుచుకున్నది ఏంటంటే.. యూఎస్‌ఏ అంటే మాకెంతో గౌరవం, అధ్యక్షుడు ట్రంప్‌కు ఎంతో రుణపడి ఉన్నాము' అని బెన్-గ్విర్ అన్నారు.వ్యవహారాల్లో ఇతర దేశాల ఒత్తిడికి లొంగిపోయి చివరకు రక్తంతో మూల్యం చెల్లించుకున్నామని అన్నారు. ఎన్నో గుణపాఠాలు నేర్చుకున్నామని చెప్పారు. ఓస్లో అకార్డ్స్, 2006 లెబనాన్ ఒప్పందం, గాజాలో ఎదురైన పరిస్థితులను కూడా మంత్రి ప్రస్తావించారు. ఆ అనుభవంతోనే యూఎస్ ఇరాన్ డీల్‌ను వ్యతిరేకిస్తున్నామని చెప్పారు.తాజాగా కుదిరిన శాంతి ఒప్పందం ప్రకారం, అన్ని రకాల మిలిటరీ చర్యలకు తక్షణం ఫుల్ స్టాప్ పెట్టాలని అమెరికా, ఇరాన్‌లు అంగీకరించాయి. లెబనాన్ సహా తమ మిత్రపక్షాలెవరిపైనా ఎలాంటి దాడులు జరగకూడదని ఇరాన్ షరతు విధించింది. ఇందుకు యూఎస్ అంగీకరించింది. అయితే, డీల్‌కు కొన్ని గంటల ముందు కూడా ఇజ్రాయెల్ లెబనాన్‌పై దాడులకు దిగింది. దీంతో, ఒప్పందం కుప్పకూలే స్థితి వచ్చిందని అన్నారు. చివరకు కొన్ని గంటల ఆలస్యంగా డీల్ ఖరారైందని చెప్పారు.

# ధాన్యం కొనుగోలులో తెలంగాణపై కేంద్రం వివక్ష: మంత్రి తుమ్మల ధ్వజం

హైదరాబాద్,

తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. మద్దతు ధర (మీస్రా), ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరును ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. కేంద్రం నుంచి ఆశించిన స్పందన లభించడం లేదని, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం కేవలం మద్దతు ధరను ప్రకటించి, ఆ తర్వాత కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకుంటోందని ఆయన ధ్వజమెత్తారు.కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకే రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, అలా నిబంధనల ప్రకారం నడుచుకుంటున్నా కూడా ఎందుకు తమపై ఇంత వివక్ష అని మంత్రి తుమ్మల ప్రశ్నించారు. మద్దతు ధర ప్రకటించిన అన్ని రకాల ధాన్యాలనూ సేకరించాల్సిన ప్రాథమిక బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పుకొంటూ, రాష్ట్ర రైతాంగాన్ని, ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. కేంద్రం చేతులెత్తేసినా రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెనకాడలేదని, ఇప్పటికే 15 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నతో పాటు, 2 లక్షల మెట్రిక్ టన్నుల జొన్నలను రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా కొనుగోలు చేసిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ఈ ధాన్యం మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా తీసుకోవాలని మంత్రి తుమ్మల డిమాండ్ చేశారు.

# మోదీ హామీల లెక్క తేల్చండి..

## ఆ తర్వాత నా రాజీనామా గురించి మాట్లాడండి

## మోదీ ఇచ్చిన హామీలపై ముందుగా సమాధానం చెప్పాలి

## మెట్రో విస్తరణను బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయి..

## మెట్రో విస్తరణకు కిషన్‌రెడ్డి నిధులు విడుదల చేయిస్తారా?

## మెట్రోపై కిషన్‌రెడ్డి కుట్ర పన్నారు..

## కిషన్‌రెడ్డిని కేసీఆర్ తిట్టినట్లు తాను తిట్టలేదు

## కేసీఆర్ డైరెక్షన్‌లోనే కేంద్రమంత్రి పనిచేస్తున్నారు..

## సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, అన్వేషనేత్రం ప్రతినిధి

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేస్తారా? అంటూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'మోదీ హామీల లెక్క తేల్చండి.. ఆ తర్వాత నా రాజీనామా గురించి మాట్లాడండి' అంటూ ప్రతి సవాల్ విసిరారు. ఈరోజు(సోమవారం) సచివాలయంలో మీడియాతో ముఖ్యమంత్రి మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ముందుగా సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. దేశ ప్రజలకు ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, విదేశాల్లోని నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రతి భారతీయుడి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని మోదీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ హామీలు ఎంతవరకు అమలయ్యాయో దేశ ప్రజలకు స్పష్టత ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. రెండు కోట్ల ఉద్యోగాల కల్పన, ప్రతి ఖాతాలో రూ.15 లక్షల జమ వంటి కీలక హామీలు నెరవేర్చకపోయినా వాటిపై ఎవరూ ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. తన ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న కిషన్‌రెడ్డి ముందుగా వీటికి సమాధాని



చెప్పాలని నిలదీశారు. ఎన్నికల హామీలు అమలు కాలేదనే కారణంతో ప్రధాని మోదీ తన పదవికి రాజీనామా చేయడానికి సిద్ధపడితే, తాను కూడా తన కేబినెట్‌ను రద్దు చేసేందుకు సిద్ధంగా ఉన్నానని సీఎం స్పష్టం చేశారు.

### మెట్రో విస్తరణను బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయి..

మెట్రో విస్తరణను బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రో విస్తరణ జరిగేచోట బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలే ఉన్నారని తెలిపారు. సమస్యలపై మాట్లాడదామంటే కేంద్రమంతి కిషన్‌రెడ్డి సమయం ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి బాధ్యత తీసుకుని మాట్లాడాలని సూచించారు. మెట్రో విస్తరణకు కిషన్‌రెడ్డి నిధులు విడుదల చేయిస్తారా? లేదా? అని ప్రశ్నించారు. లోన్ బదిలీ కాకుండా కిషన్‌రెడ్డి వల్లే మెట్రో విస్తరణ ఆగిందని ఆరోపించారు. మెట్రో విస్తరణకు రూ.40 వేల కోట్లు కావాలని సూచించారు. అంతా తామే భరిస్తామని.. చీూజ ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం లేకుండా మెట్రోను తాము విస్తరిస్తామని కేంద్ర పెద్దలతో తాము చెప్పామని పేర్కొన్నారు

### మెట్రోపై కిషన్‌రెడ్డి కుట్ర పన్నారు..

రాజకీయంగా నష్టం జరుగుతోందని మెట్రోపై కిషన్‌రెడ్డి కుట్ర పన్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రుణం ఇవ్వకపోతే కనీసం చీూజ అయినా ఇప్పించరా? అని నిలదీశారు. నిధులు ఇప్పించి చీూజ ఇస్తే శాలువా కప్పి ఆయనను సన్మానిస్తామని తెలిపారు. కిషన్‌రెడ్డిని కేసీఆర్ తిట్టినట్లు తాను తిట్టలేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ డైరెక్షన్‌లోనే కేంద్రమంత్రి పనిచేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు లొంగిపోయి కిషన్‌రెడ్డే అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. ఆయన వెనుక కేటీఆర్ ఉన్నారని ఆరోపించారు. కేటీఆర్ కుట్రలకు కేంద్రమంత్రి సహకరిస్తున్నారని ఆక్షేపించారు. కేటీఆర్ కుట్రలు చేస్తుంటే.. కిషన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

### కేటీఆర్ చెప్పిందే కిషన్‌రెడ్డి చేస్తున్నారు..

కిషన్‌రెడ్డికి అంత తెలివిలేదని.. కేటీఆర్ చెప్పిందే చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మెట్రోలో ప్రయాణించాలని ప్రధానమంత్రి నరేం ద్రమోదీ సూచిస్తున్నారని తెలిపారు. ప్రధాని సూచనలను తాము అమలు చేయాలని చూస్తుంటే.. ఆయన ఎందుకు అడ్డుకుంటున్నారు? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఫేజ్-1ను కేంద్రం స్వాధీనం చేసుకోవాలని సూచిం చారు. ఫేజ్-2 నిర్మించుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు. అహ్మదాబాద్ మెట్రోకు అనుమతులు, నిధులు వచ్చాయని ప్రస్తావించారు. హైదరాబాద్‌కు మాత్రం అనుమతులు, నిధులు ఎందుకు రావట్లేదని ప్రశ్నించారు. విశాఖపట్నం మెట్రో నిర్మాణానికి కూడా అనుమతి ఇచ్చారని తెలిపారు. తెలంగాణపై కేంద్రానికి ఎంత వివక్ష ఉందో ఈ విషయంలో అర్థమవుతోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఇందిరాగాంధీ బతికుంటే బీజేపీని నిషేధించేవారు: అశోక్ గహ్లోత్

జైపూర్/న్యూఢిల్లీ, అన్వేషనేత్రం ప్రతినిధి

దేశ రాజకీయాల్లో సరికొత్త వివాదం చెలరేగింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ భారతీయ జనతా పార్టీ (బీజేపీ)ని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. దివంగత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ గనుక ఇప్పుడు బతికుంటే బీజేపీ లాంటి పార్టీని ఎప్పుడో నిషేధించేవారంటూ ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనిపై బీజేపీ కూడా అంతే ఘాటుగా స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీకి హిందువులన్నా, హిందుత్వ అన్నా తీవ్ర ద్వేషమని మండిపడింది.జైపూర్‌లో జరిగిన ఒక అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో అశోక్ గహ్లోత్ మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో ఉన్న వాతావరణంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తన 50 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఇలాంటి 'అత్యంత ప్రమాదకరమైన' వాతావరణాన్ని ఎప్పుడూ చూడలేదని ఆయన పేర్కొన్నారు.'నేను పూర్తి బాధ్యతతో ఈ మాట చెబుతున్నాను.. దేశంలో ప్రస్తుత వాతావరణం తీవ్ర ఆందోళనకరంగా ఉంది. దేశ ప్రజలు ఇప్పటికైనా మేల్కొనకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు అనుభవించాల్సి వస్తుంది. అధికారంలో ఉన్నవారు ఉద్దేశపూర్వకంగా మతపరమైన ధ్రువీకరణకు పాల్పడుతున్నారు' అని అశోక్ గహ్లోత్ ఆరోపించారు.ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో బీజేపీ ఒక్క ముస్లిం అభ్యర్థికి కూడా సీటు ఇవ్వకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. 'దేశ ప్రజలకు చూపించడానికైనా కనీసం ఒక ఐదు సీట్లు ఇవ్వాల్సింది. కానీ తాము కేవలం 'ప్యూర్ హిందుత్వ పార్టీ' అని ప్రొజెక్ట్ చేసుకోవడమే వారి ఉద్దేశం. కేవలం హిందుత్వ మద్దతుదారులను రెచ్చగొట్టి పాలించాలనేదే వారి ఆలోచన. ఇందిరాగాంధీ లాంటి మహోన్నత నాయకురాలు నేడు బతికుంటే ఇలాంటి పార్టీపై నిషేధం విధించేవారు. కేవలం హిందువుల పేరుతోనే రాజకీయం చేయాలనుకుంటున్నారా?' అని ఆయన నిలదీశారు.

### కాంగ్రెస్‌కు హిందువులంటే ద్వేషం: బీజేపీ కౌంటర్

అశోక్ గహ్లోత్ వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీకి హిందువులు, హిందుత్వంపై ఉన్న ద్వేషాన్ని స్పష్టం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం హిందుత్వం అనేది ఒక జీవన విధానం. మరి దానిని ఇందిరాగాంధీ ఎందుకు నిషేధిస్తారు?' అని పూనావాలా ప్రశ్నించారు. అశోక్ గహ్లోత్ వ్యాఖ్యల్లో కాంగ్రెస్ నాయకుల 'ఎమర్జెన్సీ మైండ్‌సెట్' కనిపిస్తోందని విమర్శించారు.'కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ లా లేదు.. అది ఒక 'ఇండియన్ నేషనల్ ఖిలాఫత్' లా మారిపోయింది. అందుకే వారు దేశ వనరులపై మొదటి హక్కు ముస్లింలదే అంటారు. కాంగ్రెస్‌కు ముస్లింలు కావాలి, కానీ ఎవరైనా హిందూత్వం గురించి మాట్లాడితే మాత్రం వారిని పాపాత్ములుగా చూస్తూ చర్యలు తీసుకోవాలని మాట్లాడుతున్నారు.' అని పూనావాలా మండిపడ్డారు.

# గోల్కొండలో సంచలనం సృష్టించిన హత్య కేసు ఛేదించిన పోలీసులు

హైదరాబాద్,

నగరంలోని గోల్కొండలో సంచలనం సృష్టించిన హత్య కేసును పాతబస్తీ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడితో సహా నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరు పరిచారు. వారికి కోర్టు జ్యూడిషియల్ రిమాండ్ విధించింది. ప్రేమ వివాహమే ఈ హత్యకు ప్రధాన కారణమని పోలీసులు వెల్లడించారు. 2025, జనవరిలో రుక్సార్ బేగంను మసూద్ చాంది ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ వివాహాన్ని రుక్సార్ సోదరుడు జాహెద్ తీవ్రంగా వ్యతిరేకించాడు.ఈ నేపథ్యంలో వారితో అతడు తరచూ ఘర్షణకు దిగేవాడు. జూన్ 12వ తేదీన సోదరి నివాసానికి తన బంధువులతో కలిసి వెళ్లి మసూద్‌పై జాహెద్ దాడి చేశాడు. ఇనుప రాడ్లు, కత్తులతో బలంగా దాడి చేయడంతో మసూద్ అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే ఈ దాడిని మసూద్ తండ్రి షేక్ ఇస్మాయిల్ అడ్డుకోబోయారు. దాంతో ఆయన కూడా తీవ్రంగా గాయపడ్డాడు.ఈ హత్యపై ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# తెలంగాణ వచ్చినా సింగరేణిలో పరిస్థితి మారలేదు: కవిత

మంచిర్యాల, అన్వేషనేత్రం ప్రతినిధి

మాజీ మంత్రి హరీశ్ రావుపై తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. హరీశ్ రూ.40లక్షల టన్నుల బొగ్గు స్కామ్ జరిగిందని అంటున్నారని, సరైన సమాచారం లేకుండానే కోల్ బెల్ట్‌లో తిరుగుతున్నారంటూ వ్యాఖ్యానించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కూడా హరీశ్ రావు మాయలో పడ్డారన్నారు. హరీశ్‌రావు లేఖ రాయగానే.. కిషన్‌రెడ్డి వెంటనే మరో లేఖ రాశారని తెలిపారు. తెలంగాణలో ఓపెన్ కాస్ట్‌లతో సమానంగా అండర్ గ్రౌండ్స్ ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. తద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు పెరిగే అవకాశం ఉందన్నారు.తెలంగాణ వచ్చిన తర్వాత కూడా సింగరేణిలో పరిస్థితి మారలేదని కవిత వ్యాఖ్యానించారు. కార్మికులపై అత్యంత కర్కశంగా యాజమాన్యం వ్యవహరిస్తోందని.. ప్రశ్నించే కార్మికులను అధికారులు వేధిస్తున్నారని ఆరోపించారు. దీనంతటికీ కారణం ప్రభుత్వ అలసత్వమే అని మండిపడ్డారు. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సింగరేణిలో పర్యటించారని.. కానీ కార్మికుల సమస్యలను తెలుసుకోలేదన్నారు. భట్టి విక్రమార్క పర్సంటేజ్‌లు తీసుకోవడం మానేయాలని.. ఆ తర్వాతే ప్రతిపక్షాలపై విమర్శలు చేయాలన్నారు.కాంగ్రెస్ పార్టీ 2012లో బొగ్గు స్కామ్ చేసిందని టీఆర్ఎస్ చీఫ్ అన్నారు. అధికారంలోకి వచ్చిన బీజేపీ బొగ్గు బ్లాక్‌ల వేలం ప్రక్రియ చేపట్టిందని తెలిపారు. సింగరేణి కూడా వేలంలో పాల్గొనాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి జోక్యం చేసుకుని తెలంగాణ బ్లాక్‌లను సింగరేణికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఆదాయ పన్ను సమస్యను పరిష్కారం చేయాలన్నారు. బీజేపీ రాష్ట్రంలోకి వస్తేనే ఐటీ సమస్య పరిష్కారం చేస్తామని కిషన్ రెడ్డి అంటున్నారని.. ఆ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదని, సింగరేణిలోనూ గెలిచే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. 'పార్టీ పేరు అంశంలో మాకు క్లారిటీ ఉంది. కొత్త పార్టీపై ఫిర్యాదులు చేస్తున్నారంటే.. మేం బలంగా ఉన్నట్టే కదా' అంటూ కవిత పేర్కొన్నారు.

# ప్రభుత్వబడుల్లో బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించిన పొన్నం ప్రభాకర్

హైదరాబాద్:

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పునః ప్రారంభం అయ్యాయి. వేసవి సెలవుల అనంతరం విద్యాసంస్థలు తెరుచుకున్నాయి. ఇవాళ్లి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ అమలు చేశారు. రాజ్ భవన్ బడిలో బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. తొలిరోజే పాఠశాలల్లో పుస్తకాలు, నోట్ బక్స్ పంపిణీకి ఏర్పాట్లు చేశారు. పాఠశాలల్లో టీచర్లు, సిబ్బంది విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ పెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,269 ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ పథకానికి శ్రీకారం చుట్టారు. ఇంటర్, పాఠశాల విద్యార్థులకు కలిపి 1.44 లక్షల మందికి పైగా ప్రయోజనం ఉంటుంది.



# కార్పొరేట్ విద్యా మాఫియాను అరికట్టాలి..

**పాఠశాలల సమస్యలు వెంటనే పరిష్కరించాలి: ఏబీవీపీ నాయకుడు రామావత్ సతీష్**

**నల్గొండ, జూన్ 15 ( అన్వేషనేత్రం ప్రతినిధి ) :**

రాష్ట్రంలో కార్పొరేట్ విద్యా మాఫియాను కట్టడి చేసి, పాఠశాల విద్యను వేధిస్తున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఏబీవీపీ నాయకుడు రామావత్ సతీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పలు అంశాలపై ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడి దాదాపు 12 ఏళ్లు గడిచినా పాఠశాల విద్యా వ్యవస్థ పరిస్థితి మెరుగుపడలేదని విమర్శించారు. రేషనలైజేషన్ పేరుతో సుమారు 9 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేశారని, మరెన్నో పాఠశాలలు ఏకోపాధ్యాయ విధానంతో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత కారణంగా పేద కుటుంబాల విద్యార్థులు సైతం వాటి వైపు మొగ్గుచూపలేని పరిస్థితి నెలకొందన్నారు. ముఖ్యంగా బాలికలకు




అవసరమైన మరుగుదొడ్లు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ విద్యార్థులకు యూనిఫార్ములు, పాఠ్యపుస్తకాలు అందించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. పాఠశాలల్లో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలవుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల భారం తల్లిదండ్రులను తీవ్రంగా ఇబ్బంది పెడుతోందన్నారు. హైదరాబాద్‌లో నర్సరీ విద్యార్థుల నుంచే రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా ఏటా 30 శాతం వరకు ఫీజులు పెంచుతూ తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు సమర్థవంతమైన పర్యవేక్షణ చేపట్టడంలో విఫలమవుతున్నారని సతీష్ అన్నారు. అనేక మండలాల్లో పూర్తి స్థాయి మండల విద్యాధికారులు లేకపోవడంతో ఇన్‌చార్జ్‌లతోనే వ్యవహారం సాగుతోందని తెలిపారు. కస్తూర్బా గాంధీ, గురుకుల పాఠశాలలు అనుమతులు లేని శిథిలావస్థ భవనాల్లో కొనసాగుతున్నాయని, పాము కాట్లు, భవనాల పెచ్చులు ఊడిపడటం వంటి ఘటనల్లో విద్యార్థులు గాయపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల విద్యలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని రామావత్ సతీష్ హెచ్చరించారు.

# వర్షాకాలానికి ముందస్తు సన్నద్ధత అవసరం

## డ్రైన్లు, భూగర్భ మురుగునీటి మార్గాల శుభ్రపరిచే పనులు వేగవంతం చేయాలి

## మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి

**నల్లగొండ, జూన్ 15 (అన్వేషనేత్రం ప్రతినిధి) :**

వర్షాకాలంలో నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

మేయర్ సూచనల మేరకు మున్సిపల్ కమిషనర్ బి. శరత్ చంద్ర నగరంలోని 5, 38, 42 డివిజన్లలో కొనసాగుతున్న పారిశుధ్య కార్యక్రమాలు, డ్రైన్ల పూడిక తొలగింపు పనులు, భూగర్భ మురుగునీటి మార్గాల శుభ్రత కార్యక్రమాలను ఆదివారం పరిశీలించారు.

రోడ్ల వెంట ఉన్న డ్రైన్లలో పేరుకుపోయిన పూడిక తొలగింపు పనులతో పాటు ప్రత్యేక యంత్రాల సహాయంతో భూగర్భ మురుగునీటి మార్గాల్లో పేరుకున్న మట్టి, చెత్త, వ్యర్థాలను తొలగిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. వర్షపు నీరు, మురుగునీరు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడా నీటి నిల్వలు ఏర్పడకుండా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

డ్రైన్లు, మ్యాన్‌హోల్స్, భూగర్భ మురుగునీటి మార్గాల శుభ్రపరిచే పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. నీరు నిలిచే ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని స్పష్టం చేశారు.

వర్షాకాలంలో దోమల వ్యాప్తి, సీజనల్ వ్యాధులను నివారించేందుకు పారిశుధ్య కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ మున్సిపల్ యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు.






నగర పరిశుభ్రత పరిరక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని మేయర్ కోరారు. గృహ, నిర్మాణ వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లను డ్రైన్లు, కాలువల్లో వేయకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కాలువల్లో చెత్త వేయడం వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి వర్షాకాలంలో నీటి నిల్వలు, పారిశుధ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఎక్కడైనా డ్రైనేజీ సమస్యలు, నీటి నిల్వలు లేదా పారిశుధ్య లోపాలు గమనించిన వెంటనే మున్సిపల్ అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్వైజర్ జి. శ్రీనివాస్,నంద్యాల ప్రదీప్ రెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్, మరియు పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# నేరడ--గాదిరెడ్డిపల్లె బ్రిడ్జి కోసం రైతుల పోరాటం

**100 మందికిపైగా రైతులతో కలెక్టరేట్‌కు ర్యాలీ**

**వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు**

**సానుకూలంగా స్పందించిన కలెక్టర్.. అధికారులకు ఆదేశాలు**

**నల్లగొండ, జూన్ 15 (అన్వేషనేత్రం ప్రతినిధి ):**

నేరడ--గాదిరెడ్డిపల్లె గ్రామాల మధ్య అనుసంధాన బ్రిడ్జి నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ రైతులు, గ్రామస్థులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌ను ఆశ్రయించారు. కాసోజు శంకరాచారి నాయకత్వంలో వంద మందికిపైగా రైతులు, మహిళలు ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా కాసోజు శంకరాచారి మాట్లాడుతూ రెండు గ్రామాల ప్రజలు దశాబ్దాలుగా బ్రిడ్జి కోసం ఎదురుచూస్తున్నప్పటికీ సమస్యకు పరిష్కారం లభించలేదన్నారు. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మారినా ప్రజల ఇబ్బందులు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

వర్షాకాలం ప్రారంభమైతే గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయని తెలిపారు. వ్యవసాయంపై ఆధారపడిన రైతులు పొలాలకు వెళ్లడం, పండించిన పంటలను మార్కెట్లకు తరలించడం కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. సరైన రవాణా సౌకర్యాలు లేక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో సమస్య మరింత తీవ్రరూపం దాల్చుతోందని చెప్పారు. గర్భిణీలు, రోగులు, వృద్ధులను ఆసుపత్రులకు తరలించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలపై ఆధారపడాల్సి





వస్తోందని తెలిపారు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు చేరుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటూ విద్యకు దూరమవుతున్న పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

నేరడ--గాదిరెడ్డిపల్లె మధ్య బ్రిడ్జి నిర్మాణం కేవలం అభివృద్ధి పనికాదని, వేలాది మంది ప్రజల జీవనానికి కీలకమైన ప్రాజెక్ట్ అని రైతులు పేర్కొన్నారు. ఇది పూర్తయితే వ్యవసాయం, విద్య, వైద్యం, రవాణా రంగాల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటాయని వివరించారు.

రైతుల వినతిని విన్న జిల్లా కలెక్టర్ సమస్యను ప్రాధాన్యంగా తీసుకుని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు కాసోజు శంకరాచారి తెలిపారు. ఆర్అండ్‌బీ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్‌తో పాటు ఇతర అధికారులతో స్థల పరిశీలన నిర్వహించి నివేదిక సమర్పించాలని సూచించినట్లు వెల్లడించారు.

సమస్య పరిష్కారానికి చర్యలు ప్రారంభిస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. అవసరమైతే మరింత పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపట్టి బ్రిడ్జి నిర్మాణాన్ని సాధించుకుంటామని రైతులు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మర్ల రాజ్యలక్ష్మి, ఆవుల సైదమ్మ, మంద యశోద, ఆవుల యాదమ్మ, ఆవుల కవిత, వల్లపు పద్మ, వల్లపు సుజాత, చిరుగోని సాలమ్మ, తీగల కృష్ణారావు, తీగల వెంకటరావు, రామగిరి వసంతరావు, మర్ల ఉమారెడ్డి, ఆవుల నరసింహ, ఆవుల శ్రీను, వల్లపు శ్రీశైలం, చిరుగోని మల్లేష్, కడారి శంకర్, వల్లపు వెంకన్నలతో పాటు గ్రామ నాయకులు మర్ల రామ్‌రెడ్డి, గంజి కృష్ణయ్య, సన్యాసిరావు, మంద వేణుగోపాల్‌రెడ్డి, ప్రిన్స్ రమేష్‌బాబు, మిరియాల మురళీకృష్ణ, గంజి గోవర్ధన్, వీరమల్ల అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రైతులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై "బ్రిడ్జి మా హక్కు -- నిర్మాణం వెంటనే చేపట్టాలి" అంటూ నినాదాలు చేశారు.

# విద్యార్థులు రోడ్డు, సైబర్ భద్రతపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ శరత్ చంద్ర పవార్

**నల్లగొండ,జూన్ 15 (అన్వేషనేత్రం ప్రతినిధి ) :**

నూతన విద్యా సంవత్సరంలోకి అడుగుపెడుతున్న విద్యార్థులకు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు రోడ్డు భద్రత, సైబర్ భద్రత, మాదకద్రవ్యాల నివారణ, క్రమశిక్షణ వంటి అంశాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ పేర్కొన్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో సీట్‌బెల్ట్ వినియోగించాలని సూచించారు. ప్రయాణ సమయంలో మొబైల్ ఫోన్లు వంటి దృష్టి మరల్చే పరికరాలను ఉపయోగించవద్దన్నారు. "రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత" అని గుర్తుంచుకోవాలని విద్యార్థులకు సూచించారు.

నేటి డిజిటల్ యుగంలో సాంకేతికత విద్యకు అనేక అవకాశాలు కల్పిస్తున్నప్పటికీ, కొన్ని ప్రమాదాలను కూడా తీసుకొస్తోందని తెలిపారు. సోషల్ మీడియా, ఇంటర్నెట్ వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, పాస్‌వర్డ్లు, ఓటీపీలు, బ్యాంకింగ్ వివరాలు తదితర వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ పంచుకోవద్దని సూచించారు. అపరిచితుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్టులు, అనుమానాస్పద సందేశాలు, మోసపూరిత లింకులు, నకిలీ ఆఫర్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. ఏవైనా అనుమానాస్పద ఆన్‌లైన్ కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం లేదా సైబర్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. మాదకద్రవ్యాలు, పొగాకు, మద్యం తదితర హానికర పదార్థాల వినియోగం ఆరోగ్యం, విద్య, భవిష్యత్ లక్ష్యాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఎస్పీ హెచ్చరించారు. చెడు ప్రభావాలు, తోటి స్నేహితుల ఒత్తిడికి లోనుకాకుండా జాగ్రత్తపడాలని సూచించారు. అసౌకర్యంగా అనిపించే పరిస్థితులు ఎదురైతే తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం పొందాలని చెప్పారు.



ఆరోగ్యకరమైన మనస్సు, శరీరమే విజయవంతమైన జీవితానికి పునాదిగా ఉంటుందని పేర్కొన్నారు. సహ విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బందిని గౌరవించాలని, ఇతరులను బాధించే ఆటపట్టించడం, వివక్ష లేదా అనుచిత ప్రవర్తనకు దూరంగా ఉండాలని సూచించారు. చదువు, వ్యాయామం, వినోదం, విశ్రాంతి మధ్య సమతుల్యత పాటించడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ విద్యా సంవత్సరాన్ని ఆసక్తి, సంకల్పం, నిజాయితీ, ఉత్సాహంతో స్వాగతించాలని, పెద్ద కలలు కనుతూ కష్టపడి పనిచేసి సవాళ్లను ధైర్యంగా స్వీకరించాలని విద్యార్థులకు ఎస్పీ పిలుపునిచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, 100/112 సమగ్ర అత్యవసర స్పందన సేవ, 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్, 8712670266 నల్గొండ జిల్లా మాదకద్రవ్యాల నిర్మూలన హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు.

# రామన్నపేటలో ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై రైతుల ఆవేదన



**నల్లగొండ, జూన్ 15 ( అన్వేషనేత్రం ప్రతినిధి ) :**

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని దుబ్బాక, పల్లివాడ గ్రామాల ధాన్యం కొనుగోలు కేంద్రాలను నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు, ముఖ్యంగా మహిళా రైతులు, తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మార్కెట్ యార్డుల్లో ధాన్యం నిల్వ చేసి మూడు నెలలు గడిచినా కొనుగోళ్లు పూర్తికాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఎప్పుడూ ఎదురుకాలేదని, ప్రస్తుత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆర్థిక ఇబ్బందులు పెరిగాయని పేర్కొన్నారు. గతంలో రైతులకు మెరుగైన మద్దతు లభించేదని, ప్రస్తుతం కొనుగోళ్ల జాప్యంతో నష్టాలు చవిచూస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమైందని విమర్శించారు. మార్కెట్ కేంద్రాల్లో ధాన్యం కుప్పలుగా పేరుకుపోయినా అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు వడ్డీలు, కూలీ ఖర్చులు, రవాణా వ్యయాలతో అదనపు భారం మోస్తున్నారని అన్నారు. వర్షాల కారణంగా ధాన్యం తడిసి నాణ్యత కోల్పోతే అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. స్థానిక ప్రజాప్రతినిధులు రైతుల సమస్యలపై దృష్టి సారించడం లేదని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగుల్లో అసంతృప్తి పెరుగుతోందని పేర్కొన్న ఆయన, పెండింగ్‌లో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో సకాలంలో నగదు జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ధాన్యం కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# టీపీసీసీ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్

**నల్లగొండ, జూన్ 15 (అన్వేషనేత్రం ప్రతినిధి ) :**



హైదరాబాద్‌లోని నివాసంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారిని దేవరకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ గారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాల అమలు, పార్టీ బలోపేతం, అలాగే దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరంపై ఇరువురు నాయకులు అభిప్రాయాలు పంచుకున్నారు. అదేవిధంగా దేవరకొండ నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రజల అవసరాలకు అనుగుణంగా అమలు చేయాల్సిన చర్యలపై కూడా చర్చ జరిగినట్లు ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ తెలిపారు. ఈ భేటీలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజా సేవ, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు సంబంధించిన పలు కీలక అంశాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నట్లు పేర్కొన్నారు.

## మా ప్రభుత్వంపై కేటీఆర్ చేస్తున్నవి అసత్య ప్రచారాలు ప్రభుత్వవిప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంగారు

గాంధీ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించిన ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ గారు కాంగ్రెస్ ప్రభుత్వంపై అనేక అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని వేముల వీరేశం మండిపడ్డారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి పేరుతో అనేక దోపిడీలు, అక్రమాలు చేసి రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీశారని ఆరోపించారు. "మీ పది సంవత్సరాల పాలన పైకి బంగారు తెలంగాణ అని పేరు చెప్పి, లోపల అంతా దొల్లగా మార్చి రాష్ట్ర ఖజాను విధ్వంసం చేశారు" అని విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది

నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన చేస్తూ ఇందిరమ్మ రాజ్యంగా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తోందన్నారు. ఇప్పటికే 67 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగ యువతకు న్యాయం చేసిందని తెలిపారు. మీ హయాంలో అనేక చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని, భూకబ్జాలు విపరీతంగా జరిగాయని గుర్తుచేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికలు మొదలుకొని ఇటీవలి మున్సిపల్ ఎన్నికల వరకు ప్రజలు దీ=హా పార్టీకి గుండు సున్నా ఇస్తూ తిరస్కరిస్తున్నారని, అయినా వారికి బుద్ధి రావడం లేదని అన్నారు.కేటీఆర్ మంత్రిగా ఉన్న సమయంలో శనివారం, ఆదివారం రోజుల్లో ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ప్రజలకు అందుబాటులో ఉండేవారు కాదని గుర్తుచేశారు. "అలాంటి ఆయన మాకు నీతులు చెబుతున్నారు" అని ఎద్దేవా చేశారు"సొంత పార్టీ నాయకులనే కాకుండా తెలంగాణ ఉద్యమకారులను సైతం మోసం చేసిన చరిత్ర మీది కాదా?" అని ఈ సందర్భంగా కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఎన్నికలు వచ్చి గెలవలేక, దిక్కుమాలిన అడ్డగోలు సర్వేలు చేయిస్తూ "మళ్లీ మేమే వస్తామని" అసత్య ప్రచారాలు సోషల్ మీడియాలో చేయడం దీ=హాకి అలవాటుగా మారిందని దుయ్యబట్టారు.

నేటి కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ తెలంగాణ నిర్మిస్తోందని వివరించారు. పేదలకు సన్నబియ్యంతో అన్నం పెడుతోందని, అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి కొత్త రేషన్ కార్డు అడిగిన వెంటనే ఇస్తోందని, ఇందిరమ్మ ఇళ్లను కట్టిస్తోందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తోందని పేర్కొన్నారు.

"ఇవేవీ నాడు మీకు చేతకాలేదు. సరికదా తెలంగాణను డ్రగ్స్ కేంద్రంగా చేశారు. ఆ పరిస్థితులు ప్రజలు మర్చిపోలేరు" అని అన్నారు.


చివరగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు తెలంగాణ రాష్ట్రానికి శ్రీరామరక్షగా నిలిచి ప్రజాపాలనతో సంక్షేమ తెలంగాణ నిర్మిస్తున్నారని వేముల వీరేశం కొనియాడారు.



RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గొల్ల రమేష్ తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# చదువు 'కొనడం' ఎంతభారం!



ఈనెల 15 నుంచి స్కూళ్లు తెరుస్తుండడం విద్యార్థుల తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. స్కూళ్ల ఫీజులకు, ఇతర అవసరాలకు, రవాణాకు ఎంత ఖర్చు పెట్టవలసి వస్తోందో అని తర్జనభర్జన పడుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో 14 వేల ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయి. టెన్త్‌వరకు చదివే విద్యార్థులు 24 లక్షల మంది వరకు ఉన్నారు. వీరిలో 74% మంది ప్రైవేట్ స్కూళ్లలోనే చదువుతున్నారు. హైదరాబాద్ పరిసరాల్లో 60% మంది విద్యార్థులు ఉండగా, వీరిలో సగానికి పైగా మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వారే ఉన్నారు. అయితే ఈ కుటుంబాల ఆదాయం నెలకు రూ. 30 వేలు నుంచి రూ. 50 వేల లోపే ఉంటోంది. ఈ పరిస్థితుల్లో కొన్ని లక్షలు వెచ్చించి తమ పిల్లలను ఎలా చదివించుకోగలుగుతారు? ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల వసూలు విషయానికి వస్తే దేశంలో హైదరాబాద్ నగరం రెండో స్థానంలో ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణ కోసం 2017లో అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రొఫెసర్ తిరుపతిరావు ఛైర్మన్‌గా కమిటీని వేసింది. ఆ కమిటీ 10% లోపు ఫీజులను యాజమాన్యాలు పెంచుకోవచ్చని, 15% కంటే ఎక్కువ అయితే ప్రభుత్వం నిర్ణయించాల్సి ఉంటుందని ప్రతిపాదించింది. స్కూల్ విధానమే ప్రత్యామ్నాయం! కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫీజుల నియంత్రణ అంశంపై 2024 జులైలో మంత్రివర్గ ఉపసంఘం ఆధ్వర్యంలో చర్చలు జరిగాయి. తెలంగాణ ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ స్కూల్ రెగ్యులేటరీ అండ్ మోనిటరింగ్ కమిషన్ ముసాయిదా బిల్లు2025ను ప్రభుత్వానికి సమర్పించడమైంది. రెండేళ్లకోసారి 8% ఫీజులను పెంచుకోవడానికి స్కూల్ యాజమాన్యాలకు అనుమతి ఉండాలని, 9% కంటే ఎక్కువగా ఫీజులను పెంచుకోవాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని ప్రతిపాదించింది. ఫీజుల నియంత్రణకు రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని, నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దు చేయడంతోపాటు సంబంధిత సొమ్మును విద్యాసంస్థల నుంచి తిరిగి రాబట్టేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. కానీ ఇంతవరకు అది కార్యాచరణ లోకి రాలేదు. రాష్ట్రంలో ప్రస్తుతం సాధారణ స్కూళ్లలో ఐదో తరగతి చదివే విద్యార్థికి గత ఏడాది రూ. 70 వేలు వరకు వార్షిక ఫీజు చెల్లించగా, ఈ ఏడాది నుంచి రూ. 1.10 లక్షల వరకు చెల్లించవలసి వస్తుంది. కార్పొరేట్ స్కూళ్లలో ఏకంగా రూ. 2.75 లక్షలున్న ఫీజును రూ. 3.50 లక్షలకు పెంచారు. ఒక మాదిరి స్కూలులో కూడా రూ. లక్షవరకు ఫీజలు పిండుతున్నారు. వేతనాలు పెరగడం, ఎఐ విద్య కల్పించడం, లేబొరేటరీ, మౌలిక వసతుల ఖర్చులు పెరగడం వీటన్నిటి వల్ల ఫీజులు పెంచవలసి వస్తోందని యాజమాన్యాలు నచ్చచెబుతున్నాయి. విద్యార్థులను స్కూళ్లకు తీసుకెళ్లి తిరిగి ఇళ్లకు చేర్చడానికి స్కూలు బస్సులు, ఆటోల రేట్లు కూడా పెరిగాయి. కిలోమీటరు దూరానికి కనీస ఛార్జీగా నెలకు రూ. 15 వేలు వెచ్చించక తప్పదని అంటున్నారు. గత ఏడాది ఈ ఛార్జీ రూ. 10 వేలు వరకు ఉండేది. స్కూలు బస్సుల ఛార్జీలు 30 నుంచి 60 శాతం వరకు పెంచారు. అమెరికాఇరాన్ యుద్ధప్రభావంతో డీజిల్ రేట్లు పెరిగాయని అందుకే రవాణా ఛార్జీలు కూడా పెంచవలసివస్తోందని స్కూళ్ల యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. ఇక స్కూళ్లలో విక్రయించే నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్స్ తప్పనిసరిగా ఎక్కువ ధరలకు కొనుగోలు చేయవలసివస్తోంది. ఎఐ సంబంధిత పాఠాల కోసం కొన్ని ఎలెక్ట్రానిక్ గ్యాడ్జెట్లూ అంటగడుతున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. రెండో తరగతి విద్యార్థికైనా ఎఐ విద్య అవసరమని స్కూళ్ల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. ఈమేరకు గత ఏడాది రూ. 90 వేలు ఫీజు ఉంటే ఈ ఏడాది ఏకంగా రూ. 1.30 లక్షలు కట్టమంటున్నారని, ఈ విద్యకోసం కొన్ని సాఫ్ట్‌వేర్ గ్యాడ్జెట్లు కొనిపించారని దానికి రూ. 12 వేలు వసూలు చేశారని హైదరాబాద్‌కు చెందిన కుటుంబీకులు పేర్కొన్నారు. ఇన్ని విధాలుగా ఖర్చులు భరించాలంటే తాము అప్పులు చేయక తప్పడం లేదని క్రెడిట్ కార్డులు వాడుకోవలసివస్తోందని ఆందోళన చెందుతున్నారు. ఏటా అడ్డూఆపూ లేకుండా ఫీజులు పెంచుకునిపోతుంటే సామాన్యులు తమ పిల్లలను ఎలా చదివించుకోగలరని ప్రశ్నిస్తున్నారు. తమిళనాడు ప్రభుత్వం ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు ఎలాంటి చర్యలు చేపట్టిందో ప్రస్తావించవలసిన అవసరం ఉంది. టివికె ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే తమిళనాడు స్కూళ్ల (ఫీజు నియంత్రణ) సవరణ బిల్లుకు అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. రిటైర్డ్ హైకోర్టు జడ్జీ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో తల్లిదండ్రుల సంఘంనుంచి ఒకరికి చోటు కల్పించారు. కమిటీ ఖరారు చేసిన ఫీజులు మూడేళ్ల పాటు అమలులో ఉంటాయి. ప్రభుత్వం ఆమోదించిన ప్రతిపాదనలను నోటీస్‌బోర్డు, వెబ్‌సైట్, అడ్మిషన్ ఫారాలపై స్పష్టంగా, ముద్రించి ప్రదర్శించవలసి ఉంది. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే స్కూళ్ల గుర్తింపును రద్దు చేస్తారు. ఫీజు నిర్ధారణ కమిటీ పనితీరు పూర్తిగా భిన్నంగా ఉంటుంది. ఈ కమిటీ తమిళనాడు రాష్ట్రంలోని అన్ని స్కూళ్లను కలిపి ఒకే జనరల్ ఫీజును నిర్ణయించదు. దీనికి బదులుగా ప్రైవేట్ పాఠశాలల చట్టం ప్రకారం ప్రతి విద్యాసంస్థను విడివిడిగా పరిశీలిస్తుంది. ఆయా పాఠశాలల్లోని మౌలిక వసతులు, పెట్టుబడి, ఉపాధ్యాయుల వేతనాలు రోజువారీ నిర్వహణ వ్యయాల ఆధారంగానే ఆ పాఠశాల ఫీజు విధానాన్ని ఖరారు చేస్తుంది.

# ఫుడ్ డెలివరీ సంస్థలపై హొటల్ యజమానుల ఉద్యమం

చెన్నై : తమిళనాడులోని హొటళ్ల యజమానులు ఆహార డెలివరీ సంస్థలపై తిరుగుబాటు మొదలుపెట్టారు. పెద్ద కంపెనీ డెలివరీ యాప్‌లకు స్వస్తి పలుకుతున్నారు. రాష్ట్రంలో ఇది ఉద్యమంగా మొదలైందని, రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాపితమవుతుందని హొటల్ యజమానుల సంఘాలు ప్రకటిస్తున్నాయి. నామక్కల్ జిల్లాలో మొదలైన ఈ విప్లవం ఇప్పుడు కడలూరు జిల్లాకు వ్యాపించింది. మరిన్ని జిల్లాల్లోని హొటల్ యజమానుల సంఘాలు ఈ విషయమై చర్చలు నిర్వహిస్తున్నాయి.

మా మనుగడకు ఇబ్బంది : హొటల్ యాజమాన్యాలు

జొమాటో, స్విగ్గీ లాంటి ఫుడ్ డెలివరీ యాప్‌లు భారీ మొత్తంలో కమిషన్లు తీసుకుంటాయని హొటల్ యజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. తమ ప్రమేయం లేకుండా ఏకపక్షంగా డిస్కౌంట్లు ఇస్తూ తమ మనుగడకు ఇబ్బందిగా మారుతున్నారని చెబుతున్నాయి. వారి సొంత చూసుకుంటూ హొటళ్ల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని, చాలాసార్లు ఫిర్యాదులు చేసినా స్పందన రావడంలేదని వాపోయాయి. పెద్ద డెలివరీ యాప్‌లు 30-35 శాతం కమిషన్లతో పాటు జీఎస్టీలను తమ నుంచి వసూలు చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశాయి. నగరాలతో పోల్చితే ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో నైపుణ్యమైన వంట మాస్టర్లున్నారని, యజమానులున్నారని సంఘ సభ్యులు చెబుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడంతో పెద్ద డెలివరీ సంస్థల ఒప్పంద పత్రాల్ని చదవకుండానే సంతకాలు చేసేశారని ఆరోపిస్తున్నారు. ఫలితంగా చాలాచోట్ల హొటళ్లు నష్టాలతో నడుస్తూ తప్పనిసరి పరిస్థితుల్లో ఆ డెలివరీ యాప్‌లను బహిష్కరిస్తున్నట్లు వివరించారు.

జారోజ్ వైపు ఆసక్తి

కడలూరు జిల్లా చిదంబరంవాసి రామ్‌ప్రసాద్ రూపొందించిన 'జారోజ్' యాప్ మీద ఇప్పుడు హొటల్ యజమానుల సంఘాలు ఆసక్తి చూపిస్తున్నాయి. నెలకు పెద్ద రెస్టారెంట్లకు రూ.3 వేలు, చిన్న రెస్టారెంట్లకు, బేకరీలకు రూ.1500, దీనికి అదనంగా జీఎస్టీతో వచ్చిన స్థానిక యాప్‌ను వారు ఎంచుకున్నారు. దీంతో గత కొన్ని నెలలుగా 50 ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో 5 వేల హొటళ్ల నుంచి 8 లక్షల మందికి సేవలందిస్తోంది.

ఈ ఉద్యమం మొదట కేరళలో మొదలైంది..

హొటల్ యజమాన్యాలు పెద్ద డెలివరీ యాప్‌లను బహిష్కరించడం ఇదేం తొలిసారి కాదు. కేరళలో ఈ ఉద్యమం మొదలైంది. 2021లో భారీ కమిషన్లను వ్యతిరేకిస్తూ కొచ్చిలోని కొన్ని హొటళ్లు సొంతంగా యాప్‌లను రూపొందించుకున్నాయి. తర్వాత కేరళ హొటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ స్వతహాగా 'రీజోరు' పేరుతో డెలివరీ యాప్‌ను తీసుకొచ్చింది.

### ధరలు తగ్గిస్తున్నాం

ధరలు తగ్గిస్తున్నాం అని నామక్కల్‌లో జారోజ్ యాప్ ప్రారంభ కార్యక్రమంలో స్థానిక హొటల్ యజమానుల సంఘాల సభ్యులు వెల్లడించారు. కమిషన్ కింద రూ.2 నుంచి రూ.30 వేలు పెద్ద డెలివరీ యాప్‌లకు చెల్లించేవాళ్లమని తెలిపారు. ఇప్పుడు 90 శాతం ఆదా అయ్యే మార్గాన్ని ఎంచుకున్నాం అని చెప్పారు. ఆహార ధరలు కూడా తగ్గిస్తున్నామన్నారు. ఇది హొటల్ యజమానులకు, వినియోగదారులకు లాభదాయకంగా ఉందని, అందుకే పెద్ద యాప్‌లను బహిష్కరించాం అని హొటల్ యజమానుల సంఘాల సభ్యులు వివరించారు.

### ఈ ఉద్యమం రాష్ట్ర వ్యాప్తమవుతుంది

ఈ ఉద్యమం రెండు జిల్లాలకే ఆగిపోవడంలేదనీ, రాష్ట్రవ్యాప్తంగా చాలా జిల్లాల్లో చర్చలు నడుస్తున్నాయని, త్వరలో కీలక నిర్ణయం వెలువడుతుంది అని అరుళ్ మురుగన్, కార్యదర్శి, నామక్కల్ హొటల్ యజమానుల సంఘం వెల్లడించింది. హొటల్ యజమానులకు, వినియోగదారులకు నష్టం కలిగించే యాప్‌ల చర్యలను తాము వ్యతిరేకిస్తున్నామని వెంకట సుబ్బు, అధ్యక్షులు, కడలూరు జిల్లా హొటల్ యజమానుల సంఘం స్పష్టం చేసింది.

# దేశవ్యాప్తంగా ఏపిలోనే అత్యధిక పెట్రోల్ ధర ..!

అమరావతి :

**దేశంలోని పలు రాష్ట్రాల్లో సోమవారంనాటి పెట్రోల్ ధరలను పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో లీటరు పెట్రోల్ రూ.109.46 గా నమోదైంది. ఇది దేశంలోనే అత్యధిక ధర కావడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం క్రూడాయిల్ కొనుగోళ్లు ఒకే విధంగా ఉన్నప్పటికీ రాష్ట్రాలవారీగా వీటి ధరల్లో ఇంత వ్యత్యాసం ఉండటంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ అధిక ధరలకు ప్రధాన కారణాలుగా ఉన్న పెట్రోల్, డీజిల్ పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న పన్నుల స్వరూపం..!**

## రాష్ట్రాల వారీగా ధరల్లో వ్యత్యాసానికి కారణాలు

ముడి చమురు కొనుగోలు ధర అంతర్జాతీయ మార్కెట్ పై, డాలర్‌తో రూపాయి మారకం విలువపై ఆధారపడి ఉన్నప్పటికీ తుది వినియోగదారునికి చేరే పెట్రోల్ ధర రాష్ట్రాలవారీగా గణనీయంగా మారుతోంది. పెట్రోల్, డీజిల్‌ను వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) పరిధి నుంచి మినహాయించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆదాయాన్ని పెంచుకోవడానికి ఇంధనంపై విలువ ఆధారిత పన్ను (వ్యాట్)ను విధిస్తున్నాయి. ఈ వ్యాట్ ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు అధిక వ్యాట్ విధించడం వల్ల ఇక్కడ పెట్రోల్ ధర దేశంలోనే అత్యధికంగా ఉంది. తెలంగాణ, కేరళ, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో కూడా వ్యాట్ అధికంగా ఉండటం వల్ల పెట్రోల్ ధరలు భగ్గుమంటున్నాయి.

## కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించినా

కేంద్ర ప్రభుత్వం గతంలో పెట్రోల్, డీజిల్ పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించినప్పటికీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి కొన్ని రాష్ట్రాలు తమ రాష్ట్ర వ్యాట్‌ను తగ్గించలేదు. దీని ఫలితంగా కేంద్రం ఇచ్చిన తగ్గింపు ప్రయోజనం వాహనదారులకు పూర్తి స్థాయిలో అందడం లేదు. చమురు రిఫైనరీల నుంచి పెట్రోల్, డీజిల్ రవాణా చేసే దూరాన్ని బట్టి ఖర్చులు కూడా ధరను ప్రభావితం చేస్తాయి. అయినప్పటికీ ప్రధాన వ్యత్యాసానికి కారణం రాష్ట్రాల పన్ను విధానాలేనని తెలుస్తుంది. డీలర్ల కమిషన్ కూడా తుది ధరలో భాగమే. ఇది రిఫైనరీల నుంచి డీలర్లకు ఇంధనాన్ని సరఫరా చేసినందుకుగాను చమురు కంపెనీలు చెల్లిస్తాయి.

## పన్నుల స్వరూపం

పెట్రోల్ తుది ధరలో దాదాపు 50 శాతం నుంచి 60 శాతం వరకు పన్నుల రూపంలోనే ఉంటుంది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులు ఉంటాయి.

కేంద్ర ప్రభుత్వం విధించే పన్నులు

కేంద్ర ప్రభుత్వం లీటరు పెట్రోల్ పై ఒక నిర్ణీత మొత్తం (ఫిక్స్‌డ్ అమౌంట్) లో ఎక్సైజ్ సుంకాన్ని విధిస్తుంది. ఈ మొత్తాన్ని కేంద్రం తన ఖజానాకు జమ చేసుకుంటుంది. సెస్, స్పెషల్ అడిషనల్ ఎక్సైజ్ డ్యూటీ పేరుతో కూడా కేంద్రం పన్నులను విధిస్తుంది. వీటిలో చాలా వరకు రాష్ట్రాలతో పంచుకోకుండా కేంద్రమే తీసుకుంటోంది.

రాష్ట్ర ప్రభుత్వం విధించే పన్నులు

రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్ పై విలువ ఆధారిత పన్ను (వ్యాట్) ను విధిస్తున్నాయి. ముఖ్యంగా ఇది డీలర్లకు అమ్మే ధర, కేంద్రం విధించే ఎక్సైజ్ సుంకం, డీలర్ కమిషన్‌తో సహా మొత్తం ధరపై విధిస్తారు. దీని కారణంగా ఇంధనం బేస్ ధర పెరిగితే, రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం కూడా పెరుగుతుంది.



RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గొల్ల రమేష్ తెలుగు దినపత్రిక

## బిజినెస్..

# ఇండియా, చైనా మధ్య ఇండిగో డైరెక్ట్ విమానాలు

### నవంబర్ 10 నుంచి ప్రారంభం

న్యూఢిల్లీ :

ఇండియా, చైనా మధ్య డైరెక్ట్ విమాన సేవలను ప్రారంభించనున్నట్లు ఇండిగో వెల్లడించింది. నవంబర్ 10 నుంచి ఢిల్లీ, గ్వాంగ్‌జౌ మధ్య రోజువారి విమాన సేవలను అందుబాటులోకి తెస్తోన్నట్లు పేర్కొంది. ఇందుకోసం ఎయిర్‌బస్ ఎ320 విమానాలను ఉపయోగించనున్నట్లు వెల్లడించింది. కరోనా, ఆ తర్వాత డోక్లామ్ ఆందోళనల సమయంలో ఇరు దేశాల మధ్య డైరెక్ట్ విమానయాన సేవలు పూర్తిగా నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఇటీవల ప్రధాని మోడీ చైనా పర్యాటన తర్వాత ఇరు దేశాల విదేశాంగ మంత్రిత్వ శాఖలు విమాన సేవల పునరుద్దరణకు సానుకూల నిర్ణయాన్ని తీసుకున్నాయి.



# పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి అండగా ఉంటాం

## విద్యార్థుల్లో పోటితత్వం పెంచేందుకు నగదు ప్రోత్సాహాలు

## వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి

**సూర్యాపేట జిల్లా న్యూస్ జూన్: 15 (అన్వేషనేత్రం):**

పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు మంచి సంస్కారం, క్రమశిక్షణ అలవరచుకోవాలని సూచించారు. సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే గురువుల పట్ల గౌరవం, తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞత భావం కలిగి ఉండాలని





అన్నారు. పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదని, ప్రతిభ ఉన్న ప్రతి విద్యార్థిని ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులు తమ చదువుకున్న పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు సహాయం చేయాలని కోరారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు ఇటువంటి పురస్కారాలు ఉపయోగపడతాయని చెప్పారు. భవిష్యత్తులో కూడా పాఠశాలకు అవసరమైన సదుపాయాల కల్పనతో పాటు విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా మరింత మంది ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ప్రేరణ పొందుతారని అన్నారు. అనంతరం నగదు పురస్కారాన్ని అందించారు. మొదటి బహుమతి ఎన్. మేఘన రూ.1,00,000, రెండో బహుమతి వి. శృతి రూ.50,000, మూడో బహుమతి దీక్షిత రూ.25,000 ల నగదు పురస్కారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వెలుగు వెంకన్న పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గోలి పద్మ సజీవ్ ఎన్.రవీందర్ రెడ్డి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల కుదింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి:

## సీపీఎం నాయకుడు జాన్ వెస్లీ డిమాండ్

**నల్లగొండ, జూన్ 15 (అన్వేషనేత్రం ప్రతినిధి) :**

విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే కారణంతో ప్రభుత్వ పాఠశాలలను కుదించే ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకుడు జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. 16 వేల పాఠశాలలను 4 వేలకే పరిమితం చేయాలన్న ఆలోచన విద్యారంగానికి తీవ్ర నష్టం కలిగిస్తుందని విమర్శించారు.



నల్లగొండలో సోమవారం నిర్వహించిన సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పెరుగుతున్న ఫీజులను నియంత్రించేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మౌలిక వసతులు సకాలంలో అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని కోరారు.

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, సిబ్బందిని సమకూర్చాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

యువత సమస్యలపై చర్చించేందుకు సీపీఎం ఆధ్వర్యంలో జూన్ 16, 17 తేదీల్లో హైదరాబాద్‌లో యువజన సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని కోరారు. గ్రామాలు, మున్సిపల్ కేంద్రాల్లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఓటర్ల జాబితా తయారు చేయాలని సూచించారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువులు, విత్తనాలు రైతులకు సకాలంలో అందుబాటులో ఉంచాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న రైతు భరోసా నిధులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూరియా విక్రయాలకు అమలు చేస్తున్న యాప్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు.

సమావేశంలో తుమ్మల వీరారెడ్డి సహా పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఖైరతాబాద్ నియోజవర్గం వెంకటేశ్వర్ నగర్ డివిజన్ లో ఎమ్మెల్యే దానం నాగేందర్ గారి చేతులమీదుగా కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షులు రమేష్ గారు మరియు ఆకుల రాజు గారు దయ్యాల దాసు గారు గద్దెల ప్రభాకర్ గారు తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

## ప్రజావాణి దరఖాస్తులు 113

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట జిల్లా న్యూస్ జూన్ :15 (అన్వేషనేత్రం):**

ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ, ప్రజలు సమర్పించిన దరఖాస్తులకు ఆయా శాఖలు ఖచ్చితమైన సమాచారాన్ని సంబంధిత ఫార్మేట్ లో అందించాలని, రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీలలో శానిటేషన్, త్రాగునీరు సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించడానికి జిల్లా అధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి వెంటనే చర్యలు చేపట్టాలని, వర్షాకాలం మొదలైనందువలన ప్రకృతి వైపరీత్యాల వలన ఏవైనా అత్యవసర పరిస్థితులు వస్తే డిజాస్టర్ మేనేజ్మెంట్ టీమ్స్ అందుబాటులో ఉంటాయి కావున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, రెడ్ క్రాస్ సంస్థలు మానవతా దృక్పథంతో సేవలు అందిస్తున్న అందువలన వారి యొక్క సేవలు మోటివేషన్ చేయటానికి అధికారులు, సంబంధిత శాఖలు కృషి చేయాలని వారి యొక్క సేవలు వినియోగించుకోవాలని అన్నారు, నా×= లో భాగంగా వారికి ఖచ్చితమైన సమాచారాన్ని ఇవ్వాలని అధికారులు అందుబాటులో ఉండాలని, వివిధ శాఖలలో సమీక్ష సమావేశాలు పెండింగ్ లో ఉంటే వెంటనే నిర్వహించుకోవాలని, ఈ యాసంగి సీజన్ లో జిల్లాలో 3 లక్షల 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం





జరిగినదని ధాన్యం కొనుగోలులో సహకరించిన అదనపు కలెక్టర్, సివిల్ సప్లై, డిఆర్డిఏ, మెప్మా, అగ్రికల్చర్ , మండల స్పెషల్ ఆఫీసర్లు, మండల తాసిల్దార్ లు అందరికి పేరుపేరునా శుభాకాంక్షలు తెలుపుతున్నానని, ధాన్యం కొనుగోలులో ఇంకా ఏమైనా పెండింగ్ ఉంటే వెంటనే పరిష్కరించుకోవాలని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు.

సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబందించి 58 దరఖాస్తులు, డిడబ్ల్యుఓ 10, డీపీఓ 7, ఫిషరీస్ 5, డి ఆర్ డి ఏ 4, మిగిలిన 31 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని మొత్తం 113దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్బంగా అన్నారు.

ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, జడ్పీ సీఈవో శిరీష, డిఎంహెచ్ఓ వెంకటరమణ, సిపిఓ కిషన్ నాయక్, డి ఏ ఓ శ్రీధర్ రెడ్డి, డిఇఓ అశోక్ , స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు ఇతర జిల్లా అధికారులు తదితరులు హాజరైనారు

# అవినీతి పాల్పడ్డ జెడ్పీ సీనియర్ అసిస్టెంట్ మొయినుద్దీన్ సస్పెన్షన్!

జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్ సూర్యాపేట జిల్లా న్యూస్ జూన్ :15 (అన్వేషనేత్రం): పంచాయతీ కార్యదర్శుల నుండి అక్రమ వసూళ్లకు పాల్పడిన జడ్పి కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎస్ కె .మెయినోద్దీన్ ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో గరిడేపల్లి మండలంలో పని చేస్తున్న సమయంలో అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో రుజువు కావడంతో మెయినోద్దీన్ ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మెయినోద్దీన్ గతంలో గరిడేపల్లి మండలంలో సీనియర్ అసిస్టెంట్‌గా



బాధ్యతలు నిర్వహించారు. ఆ సమయంలో ఆయన తన పరిధిలోని పలువురు పంచాయతీ కార్యదర్శుల నుండి వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు మెయినోద్దీన్ చేసిన వసూళ్లపై ఎంక్వైరీ చేపట్టగా విచారణలో పంచాయతీ కార్యదర్శుల నుండి అక్రమంగా డబ్బులు వసూలు చేసినట్లు ఆధారాలతో సహా నిజాలు నిరూపితమయ్యాయి. విచారణ నివేదిక ఆధారంగా సదరు సీనియర్ అసిస్టెంట్‌పై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కఠిన చర్యలు తీసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యం, అవినీతిని సహించేది లేదనే హెచ్చరికలతో ఆయనను సస్పెండ్ చేస్తూ సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా అవినీతికి పాల్పడితే ఇలాంటి చర్యలే ఉంటాయని ఈ సందర్భంగా అధికారులు స్పష్టం చేశారు.

# తండు సైదులు గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా -- బీసీ సంఘాల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

**నల్లగొండ, జూన్ 15 ( అన్వేషనేత్రం ప్రతినిధి ) :**

ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, చంద్రం ఫౌండేషన్ చైర్మన్, తిప్పర్తి మాజీ జెడ్పిటిసి డా. తండు సైదులు గౌడ్ జన్మదిన వేడుకలు నల్గొండ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. గడియారం సెంటర్‌లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ, గత 25 సంవత్సరాలుగా బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఆయన నిరంతరం




సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ సేవాభావంతో పనిచేస్తున్న తండు సైదులు గౌడ్‌కు ఆయురారోగ్యాలు కలగాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయిలకు ఎదగాలని ఆకాంక్షించారు. అలాగే బడుగు బలహీన వర్గాల హక్కుల సాధన కోసం అందరూ ఐక్యంగా నిలవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దన్నంపల్లి సత్తయ్య, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు కర్నాటి యాదగిరి నేత, రజక అభివృద్ధి సంస్థ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు సతీష్ కుమార్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్ధన్ గౌడ్, బీసీ యువజన సంఘం జిల్లా నాయకుడు అంబటి శివకుమార్, అనత నాగరాజు గౌడ్, గడగోజు విజయాచారి, చిన్నోజు రాజు చారి, పులిపాటి జీవన్, కొంపెల్లి రామన్న గౌడ్, కర్నాటి జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అక్షరానికి అమావాస్య అడ్డా? తొలి రోజు బడికి పంపాలా వద్దా?


## తల్లిదండ్రుల్లో సందిగ్ధత

## జూన్ 15న పాఠశాలల పునఃప్రారంభం; అదే రోజు అమావాస్య కావడంతో చర్చకు దారితీసిన సెంటిమెంట్

**నల్లగొండ, జూన్ 15 ( అన్వేషనేత్రం ప్రతినిధి ) :**

వేసవి సెలవుల అనంతరం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు జూన్ 15న తిరిగి ప్రారంభం కానున్నాయి. అయితే అదే రోజు అమావాస్య కావడంతో, తొలి రోజు పిల్లలను బడికి పంపాలా వద్దా అన్న అంశంపై తల్లిదండ్రుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లోనూ ఈ అంశంపై చర్చ కొనసాగుతోంది. ఆధునిక విద్య, సాంకేతిక అభివృద్ధి విస్తృతంగా పెరిగినా, తిథులు--ముహూర్తాలపై ఉన్న సంప్రదాయ నమ్మకాలు కొంతమంది కుటుంబాల్లో ఇప్పటికీ ప్రభావం చూపుతున్నాయి.




కొంతమంది తల్లిదండ్రులు అమావాస్య రోజున కొత్త విద్యాసంవత్సరం ప్రారంభించడం శుభప్రదం కాదని భావిస్తూ, పిల్లలను మొదటి రోజు బడికి పంపడంపై సందేహం వ్యక్తం చేస్తున్నారు. అయితే మరికొందరు ఈ అభిప్రాయాలను ఖండిస్తూ, "అమావాస్య అనేది ఖగోళ శాస్త్రానికి సంబంధించిన సహజ పరిణామం మాత్రమే; విద్యా ప్రగతిపై దాని ప్రభావం శాస్త్రీయంగా నిర్ధారితం కాలేదు" అని స్పష్టం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఇప్పటికే జూన్ 12న విద్యాసంవత్సర ప్రారంభ కార్యక్రమాలు నిర్వహించాయి. ప్రార్థనా సమావేశాలు, రిబ్బన్ కటింగ్ వంటి కార్యక్రమాలతో విద్యా వాతావరణాన్ని ముందుగానే ప్రారంభించాయి.

విద్యావేత్తలు ఈ అంశంపై స్పష్టమైన శాస్త్రీయ దృక్పథాన్ని ప్రోత్సహిస్తున్నారు. "విద్యార్థుల ప్రతిభ, విజయం వారి కృషి, నిరంతర అభ్యాసం, క్రమశిక్షణపై ఆధారపడి ఉంటుంది. తిథులు లేదా గ్రహస్థితులకు విద్యా ఫలితాలతో సంబంధం ఉందని చెప్పడానికి శాస్త్రీయ ఆధారాలు లేవు" అని నిపుణులు పేర్కొంటున్నారు.

మరోవైపు, కొన్ని ప్రాంతాల్లో సోమవారం కాకుండా బుధవారం నుంచి పిల్లలను బడికి పంపాలని కొందరు తల్లిదండ్రులు నిర్ణయించుకుంటున్నట్లు సమాచారం. దీంతో తొలి రోజు హాజరు శాతం ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

మొత్తానికి, విద్యను సంప్రదాయ నమ్మకాలతో కాకుండా శాస్త్రీయ ఆలోచనతో చూడాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు సూచిస్తున్నారు. "అమావాస్య విద్యకు అడ్డంకి కాదు; అవగాహన లోపమే ప్రధాన అడ్డంకి" అనే అభిప్రాయం బలపడుతోంది.

# తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి గౌరవ శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు..



మీ

వేముల వీరేశం ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే..

మైదంచెరువు తండాలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దారవత్ రాజేందర్ నాయక్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన ఝాన్సీ రాజేందర్ రెడ్డి గారు..కొడకండ్ల మండలం మైదంచెరువు తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు దారావత్ రాజేందర్ నాయక్ ఇటీవల మృతిచెందిన విషయం తెలుసుకున్న టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఈరోజు





వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసిన వారు, దారావత్ రాజేందర్ మరణం కుటుంబానికి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఈ కష్టకాలంలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు.అనంతరం మృతుని కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.10,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు తండా ప్రజలు పాల్గొన్నారు.



"తెలంగాణ డిప్యూటీ ముఖ్యమంత్రి ఉ ఆర్థికశాఖ మంత్రి" శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ గారు..ఈరోజు తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి మరియు ఆర్థికశాఖ మంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారి జన్మదినం సందర్భంగా రాష్ట్ర సచివాలయంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ గారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ గారు మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న భట్టి విక్రమార్క గారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండి మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేసేలా భగవంతుడు ఆశీర్వదించాలని ఆకాంక్షించారు.అనంతరం భట్టి విక్రమార్క గారికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



"తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ప్రజానాయకుడు, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతున్న గౌరవనీయులు శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధిస్తూ, ఆయురారోగ్యాలతో, ఆనందంతో దీర్ఘాయుష్షుతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము. తెలంగాణ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఆయన చేస్తున్న సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షిస్తున్నాము." ????
-- హెచ్. ఆర్. మోహన్
అధికార ప్రతినిధి, కాంగ్రెస్ పార్టీ.

## పాఠశాలలు పున ప్రారంభం విద్యార్థులకు పూలతో స్వాగతం పలికిన అధ్యాపకులు

**సూర్యాపేట జిల్లా న్యూస్ జూన్: 15 (అన్వేషనేత్రం): :**

జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు వినూత్నంగా స్వాగతం పలికారు. మొదటి రోజు పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు పూలు అందజేస్తూ ఆహ్వానించారు. పాఠశాల ఆవరణను రంగు కాగితాలు, మామిడాకులతో అందంగా అలంకరించారు. అలాగే విద్యార్థులకు తొలి రోజే నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం నాగరాణి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం మెరుగైన వసతులు కల్పిస్తోందని, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.



## కల్నల్ సంతోష్ బాబు త్యాగం మరువలేనిది

### ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది







**సూర్యాపేట జిల్లా న్యూస్ జూన్: 15 (అన్వేషనేత్రం)::**

మహావీరచక్ర కల్నల్ బిక్కు మల్ల సంతోష్ బాబు త్యాగం మరువలేనిదని ఆయన జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని, దేశ సేవ కై , మాతృ భూమి రక్షణ కు ముందుకు రావాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. మహావీరచక్ర కల్నల్ సంతోష్ బాబు ఆరవ వర్ధంతి వేడుకలను సూర్యాపేట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్నల్ సంతోష్ బాబు చౌరస్తాలో ఆయన విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో పూర్వ సైనికుల ఆధ్వర్యంలో సంతోష్ బాబు విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది లు పాల్గొన్నారు. ఆర్మీ సంప్రదాయంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాల్వాన్ లోయలో చైనా జవాన్ లతో జరిగిన యుద్ధంలో కల్నల్ సంతోష్ బాబు వీరమణం పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫి వుల్లా, డీఎస్పీ ప్రసన్నకుమార్, సిఐ వెంకటయ్య, ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ , యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్,కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, కొణతం రాజేష్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, నాగుల వాసు, కల్నల్ సంతోష్ బాబు సతీమణి బిక్కుమల్ల సంతోషి, కల్నల్ సుంకరి శ్రీనివాసరావు రిటైర్డ్, ఎక్స్ సర్వీస్ మెన్ మేజర్ బిఎస్ఎన్ స్వామి, సుబెదార్ నీరజ్ దుబె రిటైర్డ్, హవల్దార్ సాగర్ దులాసి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రెబల్ శ్రీను, మన్నెం మల్లేష్ యాదవ్, ఆలేటి మాణిక్యం, గడ్డం వెంకన్న, నరేందర్ నాయుడు, రుక్మారావు, పాండు రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

**అల్పాహారం పంపిణీ**

కల్నల్ సంతోష్ బాబు ఆరవ వర్ధంతి సందర్భంగా ఆయన సతీమణి సంతోషి ఆద్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు,తోట శ్యామ్ ప్రసాద్, బిక్కుమళ్ల కృష్ణ, చల్లా లక్ష్మయ్య, మిట్టపల్లి రమేష్, సోమ ప్రవీణ్,యామా సంతోష్, బెలిదె శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ గ్రీవెన్స్ డేలో బాధితుల పిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పి నరసింహ ఐపీఎస్

**సూర్యాపేట జిల్లా న్యూస్ జూన్ :15 (అన్వేషనేత్రం):**

సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పి నరసింహ పిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఫిర్యాదులకు సంబంధించి బాధితులు ఎస్పి ని ప్రత్యక్షంగా కలిసి వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పి ప్రతి ఒక్క బాధితుడి సమస్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులుతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు.



ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఎస్పి తెలిపారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## భేరి మోగించిన సర్వోత్తమన్న

### టేకుమట్ల లింగమంతుల స్వామి, చౌడమ్మ తల్లి జాతరలో రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మొరిశెట్టి నివేదిత లక్షాది







**సూర్యాపేట జిల్లా న్యూస్ జూన్ :15 (అన్వేషనేత్రం):**

సూర్యాపేట మండలం టేకుమట్ల గ్రామ శివారులో యాదవుల ఆరాధ్య దైవలైన శ్రీశ్రీశ్రీ లింగమంతుల స్వామి, చౌడమ్మ తల్లి జాతర మహోత్సవాలకు ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి రమణారెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఎడ్ల గంగభవాని వీరమల్లు యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం జాతరకు విచ్చేసిన భక్తులతో కలిసి భేరి వాయించి ఉత్సాహ భరితంగా యాదవ సోదరులతో కలిసి పోయారు. ఈ ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు బొర్రాజు జానయ్య, జాల జనాకిరాములు, లోడంగి సోమయ్య, జాల మాణిక్యం, బొర్రాజు వెంకన్న, జాల నర్సయ్య, 11వ వార్డు కాంగ్రెస్ నాయకులు నంద్యాల మహేష్ రెడ్డి, కొప్పుల విష్ణు వర్ధన్ రెడ్డి, జంగిలి లింగయ్య, కొప్పుల వెంకట్ రెడ్డి, గోపిరెడ్డి ఉపేందర్ రెడ్డి, ఎడ్ల రమేష్, జంగిలి నాగరాజు, ఎల్లంల నాగరాజు, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, మున్సిపల్ కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి, నాగుల వాసు, గుణగంటి హేమ సతీష్, వల్దాసు లక్ష్మీ శ్రీనివాస్(రెబల్),శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఏలిమినేటి అభినయ్ నాయుడు, జిల్లా కాంగ్రెస్ సేవదల్ అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు సంకరమద్ది శ్రావ్య సుధీర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ ఎస్సి సెల్ చైర్మన్ పిడమర్తి నాగరాజు, జిల్లా కాంగ్రెస్ నాయకులు పడిదల రవి, అయ్యన్న, శాంతయ్య, నాయకులు, భక్తులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడీని అరికట్టలీ

**సూర్యాపేట జిల్లా న్యూస్ జూన్: 15 (అన్వేషనేత్రం )**

: లి. ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్ లలో ఫీజుల దోపిడిని పుస్తకాల విక్రయాలను విద్యాహక్కు చట్టం ప్రకారం 25% పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ కి వినతి పత్రం అందించిన బిసి విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ బిసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పోలోజు మహేష్ చారి పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు జిల్లేపల్లి దుర్గాప్రసాద్ సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడి అరికట్టాలని అలాగే విద్యాసంస్థలలో పుస్తకాల అమ్మకాలను నిషేధించాలని విద్యా హక్కు చట్టం ప్రకారం 25% పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించాలని కలెక్టరేట్లో సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ గారికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సోమవారం నాడు అందించారు ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పోలోజు మహేష్ చారి పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు జిల్లేపల్లి దుర్గాప్రసాద్ లు మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడి వల్ల ఎంతోమంది పేదలు ఆర్థికంగా నష్టపోతున్నారని పుస్తకాలను విద్యాసంస్థల లోనే మార్కెట్ రేటు కన్నా ఎక్కువ స్థాయిలో పుస్తకాలను అమ్మడం వల్ల ఎంతోమంది పేదలు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పుస్తకాలు యూనిఫార్మ్స్ షూస్ అమ్మడం నిషేధం ఉన్న అధికారుల నిర్లక్ష్యం వల్ల డబ్బులు అధికంగా వసూలు చేస్తున్నారని జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు అలాగే



విద్యాసంస్థలలో పేరెంట్స్ తో కమిటీ వేసి ఫీజులను బహిర్గతం చేయాలని నిబంధన ఉన్న విద్యాసంస్థలు తుంగలో తొక్కుతున్నారని విద్యా హక్కు కు చట్టం ప్రకారం ప్రతి విద్యా సంస్థ 25 శాతం ఫీజులు పేదలకు తగ్గించాలని కోర్టు నిబంధనలు వున్న వాటిని విస్మరించి ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ప్రజల నుండి ఫీజులను దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని లేనిపక్షంలో మానవ హక్కుల కమిషన్ లో ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు.

# నివేధిత ప్రతిభను అభినందించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య గారు.

రంగారెడ్డి జిల్లా మంచల్ మండలం అగపల్లి గ్రామానికి చెందిన గందమగుడెం నర్సింహా -- ప్రేమలత దంపతుల కుమార్తె నివేధితను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల



అయిలయ్య గారు ప్రత్యేకంగా కలుసుకుని అభినందించారు.ఇటీవల బీర్ల అయిలయ్య గారి జన్మదినోత్సవం సందర్భంగా చిన్నారి నివేధిత తన సృజనాత్మక ప్రతిభను ప్రదర్శిస్తూ ఒక పళ్లెంలో ఉన్న నీటి ఉపరితలంపై అయిలయ్య గారి చిత్రాన్ని అద్భుతంగా రూపొందించింది. చిన్నారి ప్రతిభ, కళాప్రతిభను గుర్తించిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గారు ఆమెను స్వయంగా కలిసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నివేధితకు శాలువాతో సత్కరించి, జ్ఞాపికతో పాటు ప్రత్యేక కానుకను అందజేశారు. చిన్న వయస్సులోనే ఇలాంటి అసాధారణ ప్రతిభ కనబరిచినందుకు ఆమెను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.అనంతరం నివేధిత కుటుంబ సభ్యులతో మాట్లాడిన బీర్ల అయిలయ్య గారు, చిన్నారి విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆమె ఉన్నత చదువులు కొనసాగించేందుకు అవసరమైన సహాయం అందిస్తామని, కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, చిన్నారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం తమకు ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. గ్రామస్తులు కూడా నివేధిత ప్రతిభను ప్రశంసిస్తూ, ఆమె భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.



బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి తెలంగాణ డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క అన్నగారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షులు కాటూరి రమేష్ గారు ఎండి గౌస్ గారు బోదాస్ నాగార్జున గారు తదితరులు పాల్గొన్నారు.

ఈరోజు హైదరాబాదులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు శ్రీ భట్టి విక్రమార్క గారి జన్మదిన సందర్భంగా వారిని మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక జన్మదిన శు భాకాంక్షలు తెలియజేయడం జరిగింది.
ఇట్లు మీ
మందుల సూర్య కిరణ్ గారు
స్టేట్ వైస్ ప్రెసిడెంట్
టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్





ఈరోజు రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీ మల్ రెడ్డి రంగారెడ్డి గారిని తొర్రూర్ లోని వారి క్యాంప్ ఆఫీస్ లో మర్యాదపూర్వకంగా కలిసిన రంగారెడ్డి జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ క్యారగారి శ్రీధర్ గారు . నూతన కమిటీల విషయంలో చర్చించడం జరిగింది దానికి వారు సానుకూలంగా స్పందించి. తక్షణమే ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోని దళిత నాయకులకు ఎస్సీ డిపార్ట్మెంట్ లో సమోచిత స్థానం కల్పించాలని వారు ఆదేశాలు ఇచ్చారు. కమిటీలు ఏర్పాటులో సహకరిస్తామని సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో వీవీజ మాజీ కార్పొరేటర్ గజ్జల రామచందర్ గారు, కంటెస్టెంట్ కార్పొరేటర్ మదరి శ్రీనివాస్ గారు, వీవీజ ఎస్సీ డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్ మైత్రి ఆనంద్ గారు, సీనియర్ నాయకులు మదారి భాస్కర్ గారు మరియు తదితరులు పాల్గొన్నారు.



ఈరోజు అనగా 14/06/2026 రోజున తొర్రూరు మండలం గుర్తూరు గ్రామ వాస్తవ్యులు శ్రీమతి శ్రీ పంజాల అరుణ బుచ్చి రాములు గార్ల కూతుర్ల నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ మహోత్సవంలో పాల్గొని చిరంజీవులు హిమబిందు రిహా గౌడ్ లను ఆశీర్వదించిన పెద్దలు పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు (తొర్రూర్ మాజీ సర్పంచ్ లు) శ్రీమతి శ్రీ పెదగాని కళావతి సోమన్న దంపతులు కర్నే సోమయ్య గారు మరియు చాపల బాపురెడ్డి గారు తదితరులు చిరంజీవులను ఆశీర్వదించడం జరిగింది




ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో, జాతీయ కుల గణన నేషనల్ క్యాస్ట్ సెన్సస్ లో ప్రత్యేక ాదీజ కాలమ్‌ను చేర్చాలని డిమాండ్ చేస్తూ ఈరోజు సుల్తాన్ బజార్‌లోని జదీ× కార్యాలయం సమీపంలో నిరసన కార్యక్రమం నిర్వహించబడినది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా. వి. హనుమంతరావు గారు ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు మోతా రోహిత్ గారు మరియు జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షులు కాటూరి రమేష్ కుమార్ గారు భవాని రమేష్ గారు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా సందేశం



రక్తదానం అంటే ప్రాణదానంతో సమానం. మనం ఇచ్చే ఒక్క యూనిట్ రక్తం ముగ్గురు వ్యక్తుల ప్రాణాలను కాపాడగలదు. రక్తానికి ప్రత్యామ్నాయం లేదు. అందువల్ల ప్రతి ఆరోగ్యవంతమైన వ్యక్తి స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలి.
ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా యువత, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు మరియు ప్రతి పౌరుడు రక్తదానం యొక్క ప్రాముఖ్యతను గుర్తించి సమాజంలో అవగాహన కల్పించాలి. రక్తదానం ద్వారా ఒక కుటుంబానికి ఆశను, ఒక ప్రాణానికి జీవితాన్ని అందించవచ్చు.
ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి హెచ్. ఆర్. మోహన్ స్వచ్ఛందంగా రక్తదానం చేసి రక్తదానం యొక్క గొప్పతనాన్ని చాటారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి అవసరమైన సమయంలో ప్రాణాలను కాపాడేందుకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆయన పిలుపునిచ్చారు.
రక్తదానం చేయండి -- ప్రాణాలను కాపాడండి"
మీ రక్తం ఎవరికో జీవన వరం"
ఈరోజు రక్తదానం రేపు ఎవరికో జీవనాధారం"
హెచ్. ఆర్. మోహన్
అధికార ప్రతినిధి
కాంగ్రెస్ పార్టీ

# శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్ లు ఎమ్మెల్యే లు

తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారి జన్మదిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలంగాణ ప్రభుత్వ విప్ వేముల వేరేషం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ మిర్యాలగూడ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హైదరాబాద్ లోని ప్రగతి భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య గారు మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని



అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తూ రాష్ట్ర ప్రగతికి విశేష కృషి చేస్తున్న నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని పేర్కొన్నారు.భట్టి విక్రమార్క గారు ఆయురారోగ్యాలతో, ఆనందంగా, దీర్ఘాయుష్షుతో ఉండాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించి, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి మరింత సేవలందించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఇరువురు నాయకులు రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, ఆలేరు నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై స్నేహపూర్వకంగా చర్చించారు. .



మెట్రో నిర్మాణ పనులపై రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు సచివాలయంలో ఈ రోజు నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొన్న మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యులు, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ గారు.



తెలంగాణ రాష్ట్రంలో గౌరవ ముఖ్యమంత్రి ూా. =వఝుత్ష్ర =వఎఎఎ గారి రెండున్నర సంవత్సరాల ప్రజాపాలనకు ప్రత్యక్ష సాక్ష్యంగా, ఈరోజు ప్రతిపక్ష పార్టీలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను కొనియాడుతూ ముఖ్యమంత్రి గారి నాయకత్వాన్ని అభినందించడం విశేషం. ప్రజా సంక్షేమం, పారదర్శక పాలన, ఉద్యోగావకాశాల కల్పన, మౌలిక వసతుల అభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారత వంటి అంశాల్లో ప్రభుత్వం సాధిస్తున్న విజయాలు రాష్ట్ర ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతోంది. ఈ నేపథ్యంలో రాజకీయాలకు అతీతంగా పలువురు నాయకులు ముఖ్యమంత్రి గారి పనితీరును ప్రశంసించడం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనంగా నిలుస్తోంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన అందిస్తూ, అభివృద్ధి మరియు సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం మరింత ప్రగతి పథంలో దూసుకుపోతుందని కాంగ్రెస్ పార్టీ విశ్వసిస్తోంది. -- హెచ్.ఆర్. మోహన్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి.

# యాదాద్రి భువనగిరి జిల్లా డీసీసీ ఆధ్వర్యంలో భువనగిరి నియోజకవర్గ దీూాలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం.





పాల్గొన్న బీర్ల అయిలయ్య,కుంభం అనిల్ కుమార్ రెడ్డి,సచిన్ సావంత్ గార్లు.
యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణానికి చెందిన వివేరా హోటల్లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) కార్యక్రమంపై భువనగిరి నియోజకవర్గ బూత్ లెవల్ ఏజెంట్లు (దీూాలు) కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు నమోదు కావడం, అనర్హుల పేర్ల తొలగింపు, వివరాల సవరణ వంటి అంశాలపై దీూాలకు సమగ్ర అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లిప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య,భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి మరియు తెలంగాణ ఇన్‌చార్జి సచిన్ సావంత్, హాజరయ్యారు.ఈ ంగా వారు మాట్లాడుతూ, ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని పేర్కొన్నారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా దీూాలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, పేరు లేదా ఇతర వివరాల్లో ఉన్న తప్పులను సరిచేయించే ప్రక్రియలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.అలాగే, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని తెలిపారు. పార్టీ శ్రేణులు, దీూాలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఓటు హక్కు వినియోగంపై ప్రతి కుటుంబానికి సమాచారం చేరవేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు జిల్లా, మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, దీూాలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శిక్షణ అనంతరం ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన సందేహాలను నాయకులు నివృత్తి చేసి, కార్యాచరణపై మార్గనిర్దేశం చేశారు.

# తొర్రూరులో ఘనంగా హిమబిందు, రిహా గౌడ్‌ల నూతన పుష్పలంకరణ వేడుక..

తొర్రూరు మండలం గుర్తూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా గాయకుడు పంజల బుచ్చిరాములు గారి కుమార్తెలు హిమబిందు, రిహా గౌడ్‌ల నూతన పుష్పలంకరణ వేడుక తొర్రూరులోని కళ్యాణలక్ష్మి గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య




అతిథులుగా హాజరైన పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి రాజరామోహన్ రెడ్డి గారి దంపతులు మరియు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి గారు చిన్నారులను ఆశీర్వదించి వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులను అభినందించి, హిమబిందు మరియు రిహా గౌడ్‌లు విద్యా, సాంస్కృతిక రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో బంధుమిత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు.



RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గోల్ల రమేష్
తెలుగు దినపత్రిక

# ఆట

## సూర్యకుమార్ యాదవ్‌పై వేటు..



పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌పై భారత సెలెక్టర్లు వేటు వేసినట్లు తెలుస్తోంది. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని టీమిండియా ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 గెలిచినా అతన్ని కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించేందుకు అజిత్ అగార్కర్ సారథ్యంలోని సెలెక్షన్ కమిటీ సిద్ధమైనట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. గతేడాదిగా సూర్యకుమార్ యాదవ్ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నాడు. దాంతోనే జట్టు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుందని ఓ అధికారి మీడియాకు తెలిపారు. అప్‌కమింగ్ సిరీస్‌ల్లోనూ అతనికి చోటు దక్కే అవకాశం లేదని స్పష్టం చేశారు. 'సూర్యకుమార్ యాదవ్‌ను టీ20 కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించాలని బీసీసీఐ నిర్ణయించింది. అతని స్థానంలో శ్రేయస్ అయ్యర్ సారథ్య బాధ్యతలు చేపడుతాడు. ఐర్లాండ్, ఇంగ్లండ్తో జరిగే టీ20 సిరీస్‌ల్లో టీమిండియాను శ్రేయస్ అయ్యర్ నడిపిస్తాడు. గతంలో సూర్యకుమార్ యాదవ్ ఆడిన నాలుగో నంబర్ స్థానంలో శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్‌కు దిగుతాడు. యువ బ్యాటర్ తిలక్ వర్మను వైస్ కెప్టెన్‌గా నియమించనున్నారు. టీ20 ప్రపంచకప్‌లో వైస్ కెప్టెన్‌గా ఉన్న అక్షర్ పటేల్‌ను ఈసారి పరిగణనలోకి తీసుకోలేదు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. సంజు శాంసన్‌ను కెప్టెన్‌ను చేయాలని కోరాడు. కానీ అజిత్ అగార్కర్ సారథ్యంలోని సెలెక్షన్ కమిటీ అందుకు అంగీకరించలేదు. సంజూ బ్యాటింగ్‌లో నిలకడ లేదని సాకుగా చూపారు. ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చినప్పటికీ.. సంజూను కెప్టెన్ చేసేందుకు అంగీకరించలేదు. చివరికి శ్రేయాస్ అయ్యర్‌ను కెప్టెన్‌గా.. తిలక్ వర్మను వైస్ కెప్టెన్‌గా నియమించడానికి అందరూ అంగీకరించారు.



## వైభవ్ వెనుక కార్పొరేట్ కంపెనీల పరుగులు

క్రికెట్ ప్రపంచంలో ప్రస్తుతం ఒకే ఒక్కడి పేరు మారుమోగిపోతోంది. అతడే 15 ఏళ్ల టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ. ఇటీవలే ముగిసిన ఐపీఎల్ 2026 సీజన్‌లో ఈ బుడ్డోడు సృష్టించిన సునామీ అంతా ఇంతా కాదు. రాజస్థాన్ రాయల్స్ జట్టు తరపున ఆడిన వైభవ్.. తన బ్యాటింగ్ విశ్వరూపంతో క్రికెట్ దిగ్గజాలనే ఆశ్చర్యపరిచాడు. ఐపీఎల్ ముగింపు వేడుకల్లో మేజర్ అవార్డులన్నింటినీ ఇతడే క్లీన్ స్వీప్ చేశాడు. దాంతో రాత్రికి రాత్రే ఈ బిహార్ కుర్రాడి బ్రాండ్ వాల్యూ ఆకాశాన్ని తాకింది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలను సైతం పక్కకు నెట్టి కార్పొరేట్ కంపెనీలు ఈయన వెనుక పరుగులు పెడుతున్నాయి. ఐపీఎల్ 2026 సీజన్‌లో రన్నరప్ రేసులో రాజస్థాన్ క్వాలిఫైయర్-2 లో ఓడిపోయినప్పటికీ, వైభవ్ సూర్యవంశీ మాత్రం చరిత్ర సృష్టించాడు. ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ సాధించడంతో పాటు మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్, ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్, సూపర్ స్ట్రైకర్, సూపర్ సిక్సెస్ అవార్డులను కైవసం చేసుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత చిన్న వయసులో ఈ అవార్డులు గెలవడమే కాకుండా.. ఒకే సీజన్‌లో ఎంవీపీ, ఎమర్జింగ్ ప్లేయర్ అవార్డులు రెండూ సాధించిన ఏకైక ఆటగాడిగా రికార్డులకెక్కాడు. ఐపీఎల్ వ్యవస్థాపకుడు లలిత్ మోదీ సైతం స్పందిస్తూ.. భవిష్యత్తులో బాలీవుడ్, హాలీవుడ్ స్టార్ల కంటే పెద్ద సెలబ్రిటీ వైభవ్ అవుతాడని జోస్యం చెప్పారు. ఐపీఎల్‌లో వైభవ్ చూపించిన ప్రతాపానికి బ్యాట్ స్పాన్సర్‌షిప్ మార్కెట్ అప్సెట్ అయిపోయింది. కోహ్లీ బ్యాట్ స్పాన్సర్ ఎమ్ఆర్ఎఫ్, రోహిత్ శర్మ బ్యాట్ స్పాన్సర్ సియట్ లాంటి దిగ్గజ క్రీడా సంస్థలు వైభవ్ బ్యాట్ రైట్స్ కోసం పోటీ పడుతున్నాయి. మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం ఒక ప్రముఖ కంపెనీ అయితే ఈ 15 ఏళ్ల కుర్రాడికి ఏకంగా బ్లాంక్ చెక్ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రేజ్ చూసి వైభవ్ తన కమర్షియల్ యాడ్స్ రేట్లను ఏకంగా రెట్టింపు చేసేశాడు. వైభవ్ సూర్యవంశీ కమర్షియల్ జర్నీ ప్రముఖ న్యూట్రిషన్ బ్రాండ్ కాంప్లాన్ ఇండియాతో ప్రారంభమైంది. 2026 ప్రారంభంలోనే కాంప్లాన్ సంస్థ అతనితో థోడా ప్లాన్, థోడా కాంప్లాన్ అనే క్యాంపెయిన్ కోసం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ దాదాపు రూ.75 నుంచి 80 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ యాడ్‌లో వైభవ్ క్రమశిక్షణతో కూడిన శిక్షణ, క్రీడాకారులకు పోషకాహారం ఎంత ముఖ్యమనే విషయాలను హైలైట్ చేశారు.వైభవ్ సూర్యవంశీ కమర్షియల్ జర్నీ ప్రముఖ న్యూట్రిషన్ బ్రాండ్ కాంప్లాన్ ఇండియాతో ప్రారంభమైంది. 2026 ప్రారంభంలోనే కాంప్లాన్ సంస్థ అతనితో థోడా ప్లాన్, థోడా కాంప్లాన్ అనే క్యాంపెయిన్ కోసం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ దాదాపు రూ.75 నుంచి 80 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ యాడ్‌లో వైభవ్ క్రమశిక్షణతో కూడిన శిక్షణ, క్రీడాకారులకు పోషకాహారం ఎంత ముఖ్యమనే విషయాలను హైలైట్ చేశారు.మే 30వ తేదీన జార్ఖండ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఇర్ఫాన్ అన్సారీ ఒక కీలక ప్రకటన చేశారు. వైభవ్‌ను యూత్ ఎనర్జీకి నిలువెత్తు రూపంగా అభివర్ణిస్తూ, త్వరలోనే జార్ఖండ్ ఆరోగ్య శాఖ తరుపున ప్రచారకర్తగా నియమించనున్నట్లు పేర్కొన్నారు.

RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గోల్ల రమేష్
తెలుగు దినపత్రిక

# సినిమా

CINEMA





## మాటే పాటయితే.. సింగీతం తరహా మూవీ

94ఏండ్ల వయసులో సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించిన ఫాంటసీ కామెడీ మ్యూజికల్ ఫిల్మ్ 'సింగ్ గీతం'. మాటల్లేకుండా 'పుష్పక విమానం' వంటి గొప్ప క్లాసిక్‌ని తెరకెక్కించిన సింగీతం.. 'మాటలే పాటలైతే' అని కాన్సెప్ట్‌తో ఈ సినిమా రూపొందించారని తెలియగానే, ప్రేక్షకుల్లో ఈ సినిమాపై ఆసక్తి మొదలైంది. పైగా ప్రతిష్టాత్మక వైజయంతీ మూవీస్, స్వప్న సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మించడం, సింగీతం విజన్‌కి నాగ్ అశ్విన్ మేకింగ్ తోడవ్వడంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. కథలోకి వెళితే..ప్పుడే జైలు నుంచి విడుదలైన ప్రతాప్(ఆయాన్) తన తండ్రి తన పేరు రాసిన ఆస్తిని దక్కించుకునేందుకు అగ్రిమెంట్ పేపర్లను తీసుకొని కుబేరపురం గ్రామానికి వెళ్తాడు. అదో మిస్టీరియస్ విలేజ్. అక్కడ ఓ కొండ ఉంటుంది. ఆ కొండలో కుబేరుడి గుహ కూడా ఉంటుంది. ఆ ప్రాంత జనం కుబేరుడ్ని పూజిస్తుంటారు. ఎడారిని తలపించేలా ఉన్న ఆ ఊరిలో ఒకేఒక భారీ వృక్షం ఉంటుంది. ఆ చెట్టంటే ప్రాణం ఇచ్చే గౌరీ(అహల్య)ని కలుసుకుంటాడు ప్రతాప్. ఆమె ద్వారా సెల్ఫిష్ మైనింగ్ బిజినెస్ విమెన్ రేణు(షాలిని)ని కలుస్తాడు. ఆ ప్రాంతమంతా బంగారు గని అని రేణు మాటల ద్వారా తనకు అర్థమవుతుంది. రేణు, ఆమె తండ్రి(బెనర్జీ) ఇద్దరూ కలిసి తన పేరున్న స్థలంలో కూడా మైనింగ్ జరిపి, అక్కడున్న బంగారాన్ని కూడా దోచుకోవాలని చూస్తున్నారనే విషయం ప్రతాప్‌కి తెలుస్తుంది. ఉన్నట్టుండి భాగస్తుడైన ప్రతాప్ రావడంతో, చేసేది లేక రేణు, రేణు తండ్రి తమ వ్యాపారంలో ప్రతాప్‌ని కూడా భాగస్తుడిగా చేర్చుకుంటారు. అప్పటికే ఆ ప్రాంతం అంతా మైనింగ్ జరిపేసి ఉంటుంది. ఒక్క వృక్షం ఉన్న ప్లేస్‌లో మాత్రం మైనింగ్ జరిగి ఉండదు. దాంతో అక్కడ మైనింగ్ చేద్దామని ప్రతాప్ సూచించడంతో, అహల్య వద్దని వారిస్తున్నా, ఆ భారీ వృక్షాన్ని కూలగొడతారు. దీంతో గౌరీ తీవ్ర మనస్తానికి గురవుతుంది. ఆ బాధలోనే అనుకోకుండా కుబేర గుహలోకి వెళ్తుంది. ఊహించని విధంగా ఆ ఊరి జనమందరికీ మాట కాస్తా పాటై కూర్చుంటుంది. అందరూ నిజాలు చెప్పేస్తుంటారు. మాటను పాటలా పాడుతూ అంతా విచిత్రంగా, విడ్డూరంగా ఫీలవుతుంటారు? ఆ జనానికి మళ్లీ మాట ఎలా వచ్చింది? కుబేరుడి శాపం వల్ల ఆ ప్రాంతంలో ఎలాంటి పరిణామాలు తలెత్తాయి? అనేది మిగతా కథ. సింగీతం శ్రీనివాసరావు అంటేనే ఓ ప్రయోగశాల. మాటే పాటైతే అంటూ మరో కొత్త ప్రయోగానికి తెర లేపుతూ చేసిన ప్రయత్నమే ఈ సినిమా. ఇది అన్ని సినిమాల్లాంటి సినిమా కాదు. నాగ్ అశ్విన్ చెప్పినట్టు ఇలాంటి సినిమాను ప్రపంచం నిజంగానే చూడలేదు. అది నిజంగా వందశాతం నిజం.

## జైలర్-2లో గెస్ట్ పాత్రలో హృతిక్ ?

సూపర్‌స్టార్ రజినీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ డ్రామా 'జైలర్ 2'. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కి సంబంధించి ఒక అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. ఈ సినిమాలో మొదట బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ అతిథి పాత్రలో కనిపించబోతున్నాడని గతంలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ ఈ సినిమాలో ఒక పవర్‌ఫుల్ అండ్ ఇంటెన్స్ కామియో రోల్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. గతంలో రజినీకాంత్, హృతిక్ రోషన్ కలిసి నటించిన 'భగవాన్ దాదా' (1986) చిత్రం తర్వాత, దాదాపు 40 సంవత్సరాల అనంతరం వీరిద్దరూ కలిసి మళ్లీ ఒకే స్క్రీన్‌పై కనిపించబోతున్నారు. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్‌కి సంబంధించిన కొన్ని కీలకమైన సన్నివేశాలను జూన్ 22, 23 తేదీల్లో చెన్నైలో ప్రత్యేకంగా వేసిన సెట్స్‌లో భారీ ఎత్తున చిత్రీకరించనున్నట్లు ఇండస్ట్రీ టాక్. ఈ మైండ్ బ్లోయింగ్ క్రేజీ అప్‌డేట్ ఇటు సౌత్ ఇండస్ట్రీతో పాటు అటు నార్త్ ప్రేక్షకుల్లోనూ సినిమాపై ఉన్న అంచనాలను ఒక్కసారిగా స్కై హైకి తీసుకెళ్లింది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, ఎస్.జె.సూర్య, మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, సీనియర్ నటి రమ్యకృష్ణ, మిర్నా మీనన్, హాస్య నటుడు యోగి బాబు వంటి భారీ తారాగణం నటిస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అంది స్తుం డగా, ఈ ఏడాది చివర్లోనే ఈ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.




## కిరణ్ అబ్బవరం కెఎ 13

### సొంత బ్యానర్‌పై దర్శకత్వ బాధ్యతలు

యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం తన కెరీర్‌లో సరికొత్త అడుగు వేస్తూ, సరికొత్త ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న 13వ చిత్రానికి 'కెఎ13' అనే వర్కింగ్ టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమాకు సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ శనివారం నుంచి అధికారికంగా ప్రారంభం కాబోతున్నట్లు చిత్ర బృందం ఒక ఆసక్తికరమైన పోస్టర్ ద్వారా ప్రకటించింది. అయితే ఈ చిత్రానికి ఒక ప్రత్యేకత ఉంది. కిరణ్ అబ్బవరం కేవలం హీరోగానే కాకుండా, ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను కూడా స్వయంగా ఆయనే చేపట్టడం విశేషం. దర్శకుడిగా ఆయనకు ఇది సరికొత్త ప్రయాణం కానుంది. జాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై సుధాకర్ చాగంటి ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఒక లాడ్జ్ లేదా హోటల్ రిసెప్షన్ డెస్క్‌పై ఉండే బెల్‌ను నొక్కుతున్నట్లుగా ఉన్న ఈ చిత్ర అనౌన్స్‌మెంట్ పోస్టర్ చూస్తుంటే, కిరణ్ అబ్బవరం ఈసారి ఒక విభిన్నమైన కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సస్పెన్స్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు స్పష్టమవుతోంది.



Printed Published and owned by Golla Ramesh, No.8-4-111, NG. Colony, Ramagiri, Nalgonda-508001 Telangana State, Printed at Prabhu publication H.No.6-4-111. NC Colony Ramaghir, Nalgonda-508001 Telangana State Publisheds H.No.6-4-111. NG. Colony, Ramagiri, Netponde-508001 Telanagan Stsos, Editor T Golla RN.No. TELTEL/201002434